ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక



సంపుటి: 6 సంచిక: 141, పేజీలు - 08

సోమవారం, నవంబర్ 23, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

తెలంగాణలో కాంగ్రెస్‌దే

రెండోసారి అధికారం



- కోటి ఓట్లు.. 90 అసెంబ్లీ స్థానాలే లక్ష్యం: సీఎం రేవంత్ రెడ్డి

- పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో కష్టపడితేనే మరోసారి విజయం - పనిచేసే ప్రతి ఒక్కరికీ పార్టీలో గుర్తింపు
- నేతల పనితీరుపై సమగ్ర సమాచారం ఉంది - కష్టపడి పార్టీని చెడగొట్టే వారిని గుర్తుపెట్టుకుంటాం
- పైరవీలు కాదు.. ప్రజల మధ్య ఉంటేనే పదవులు - లోక్‌సభ ఎన్నికల్లో 15 ఎంపీ సీట్లు గెలిచి రాహుల్‌ను ప్రధాని చేయడమే లక్ష్యం




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ రెండోసారి అధికారంలోకి రావడం ఖాయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కోటి ఓట్లు సాధించి 90 స్థానాల్లో విజయం సాధించడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ కోసం కష్టపడే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందని, పార్టీ నేతలు, కార్యకర్తల పనితీరును నిశితంగా పరిశీలిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరి పనితీరుపై పార్టీ వద్ద సమగ్ర సమాచారం ఉందని పేర్కొంటూ, కష్టపడుతున్నట్లు నటిస్తూ పార్టీకి నష్టం కలిగించే వారిని గుర్తించి గుర్తుపెట్టుకుంటామని హెచ్చరించారు.ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పీసీసీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి బీఎం సందీప్, సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,

2లో..

బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లకు హిందూ సంప్రదాయాలపై

అవగాహన లేదు

- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శ



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారతీయ ఆధ్యాత్మిక, మత సంప్రదాయాలపై బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లకు ఏమాత్రం అవగాహన లేదని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తీవ్రంగా విమర్శించారు. భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మికతలోని అసలు భావాలను అర్థం చేసుకోకుండా కులతత్వం, పురుషాధిక్య భావజాలాన్ని ప్రోత్సహిస్తున్నాయని ఆరోపించారు. ఆదివారం తన ఎక్స్ ఖాతాలో ఎలిఫెంటా గుహల్లోని 12వ శతాబ్దానికి చెందిన శివుడి ఒడిలో పార్వతీదేవి కూర్చున్న శిల్పం ఫొటోను షేర్ చేశారు. ఈ సందర్భంగా 'సత్యం శివం సుందరం' అంటూ తన అభిప్రాయాలను వెల్లడించారు. భారతీయ ఆధ్యాత్మిక, మత సంప్రదాయాలను లోతుగా అర్థం చేసుకునే కొద్ది బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లలో సంస్కార లోపం, కులతత్వం, పురుషాధిక్య ధోరణులు కనిపిస్తున్నాయని రాహుల్ పేర్కొన్నారు. ఆ పార్టీల మద్దతుదారుల హృదయాల్లో భయం, కోపం, ద్వేషం పేరుకుపోయాయని, అందుకే వారు ప్రేమను

2లో..

కాంగ్రెస్ సర్కారుకు

కౌంట్‌డౌన్ మొదలైంది

2028లో కేసీఆర్ మళ్లీ సీఎం కావడం ఖాయం: కేటీఆర్

- కాంగ్రెస్ పాలనలో అవినీతి, కమీషన్ల దందా
- ప్రజాపాలన కంటే పర్సంటేజీల పాలనే ఎక్కువ
- వరంగల్ అభివృద్ధిని పూర్తిగా విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం
- బీఆర్ఎస్‌తోనే వరంగల్‌కు పారిశ్రామిక, ఐటీ రంగాల్లో భవిష్యత్తు



వరంగల్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు రోజులు దగ్గరపడ్డాయని, ఆ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఇంకా 500 రోజులే మిగిలి ఉన్నాయని, 2028లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. వరంగల్‌లోని కేడీసీ గ్రౌండ్‌లో నిర్వహించిన జన చైతన్య సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఏకశిలా విద్యాసంస్థల అధినేత గౌరు తిరుపతి రెడ్డి తన అనుచరులు, వివిధ రంగాలకు చెందిన పలువురు మేధావులతో కలిసి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ కండువా కప్పుకుని పార్టీలో చేరారు.

2లో..

కరీంనగర్‌లో కాషాయ దండయాత్ర

- సృష్టించేలా ఉండబోతుందన్న బండి సంజయ్




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు మద్దతుగా కరీంనగర్‌లో నిర్వహించనున్న బీజేపీ మహా పాదయాత్ర దేశవ్యాప్తంగా చరిత్ర సృష్టించబోతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. ఎస్ఐఆర్‌ను అడ్డుకునే వారంతా దేశద్రోహులేనని, విదేశీ అక్రమ చొరబాటుదారులకు

2లో..

పంచాయతీ ఎన్నికల్లో పంతాలు వద్దు..

ఏకగ్రీవాలే ముద్దు

- గ్రామాభివృద్ధే లక్ష్యంగా ఎన్నికలకు వెళ్లాలన్న సీఎం చంద్రబాబు



- పార్టీ ముఖ్యనేతలు, మంత్రులతో సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్
- స్థానిక సంస్థల ఫలితాలు కూటమి పాలనకు ప్రజామోదం
- ఏకగ్రీవ పంచాయతీలకు రూ.15 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ప్రోత్సాహకాలు

అమరావతి (ప్రశ్న న్యూస్) రాబోయే పంచాయతీ ఎన్నికల్లో రాజకీయ పంతాలు, వ్యక్తిగత పట్టింపులకు తావులేకుండా ఏకగ్రీవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పార్టీ నేతలు, మంత్రులకు సూచించారు. గ్రామాల సమగ్ర అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని సాధ్యమైనంత ఎక్కువ పంచాయతీలను ఏకగ్రీవం చేసేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం గ్రామస్థాయి నాయకులతో సంప్రదింపులు జరిపి, అందరినీ ఏకతాటిపైకి తీసుకురావాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలపై ఉందని స్పష్టం చేశారు. పార్టీ ముఖ్యనేతలు, మంత్రులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు, త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికల సన్నద్ధత, ఏకగ్రీవాల ప్రాధాన్యతపై చంద్రబాబు చర్చించారు. పార్టీ గుర్తులపై జరిగిన మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఫలితాలు కూటమి ప్రభుత్వం రెండున్నరేళ్ల పాలనకు ప్రజలు ఇచ్చిన స్పష్టమైన ఆమోదమని పేర్కొన్నారు. అన్ని ప్రాంతాల్లోనూ ప్రజలు కూటమికి మద్దతు తెలిపారని,

2లో..

పంచాయతీ ఎన్నికల్లో సీట్ల పంపకాలు లేవు

- జనసేన శ్రేణులకు పవన్ కల్యాణ్ పూర్తి స్వేచ్ఛ



అమరావతి (ప్రశ్న న్యూస్) గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే విషయంలో జనసేన పార్టీ శ్రేణులకు పూర్తి స్వేచ్ఛ కల్పిస్తూ ఆ పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే జనసేన నాయకులు, జనసైనికులు, వీర మహిళలు ఎవరైనా స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసి బరిలో నిలవవచ్చని స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో ఎలాంటి సీట్ల పంపకాలు ఉండవని తేల్చిచెప్పారు. పోటీ చేయాలనుకునే పార్టీ శ్రేణులను ఎవరూ అడ్డుకోవద్దని నాయకులకు ఆదేశాలు జారీ చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు రాజకీయ పార్టీలకు అతీతంగా స్థానిక సంస్థలను బలోపేతం చేసే లక్ష్యంతో నిర్వహించే ఎన్నికలని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పోటీ చేయాలనుకునే ప్రతి ఒక్కరికీ ఎలాంటి రాజకీయపరమైన అడ్డంకులు లేకుండా నామినేషన్ వేసి ఎన్నికల్లో పాల్గొనే అవకాశం కల్పించాలని సూచించారు. మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల తరహాలో పంచాయతీ ఎన్నికల్లో స్థానాల పంపకాలు ఉండవని స్పష్టం చేశారు. జనసేన తరఫున స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరగాలన్నదే తమ ఆకాంక్షగా పేర్కొన్నారు.

2లో..

హైదరాబాద్‌కు ఉగ్రదాడి బెదిరింపు మెయిల్

- పోలీసులు అలర్ట్.. కీలక సూచనలు!

- హైదరాబాద్‌లో బాంబు దాడులు చేస్తామంటూ బెదిరింపు ఈమెయిల్
- నగరవ్యాప్తంగా ముమ్మరంగా యాంటీ సబోటేజ్ తనిఖీలు
- నిందితుల కోసం సైబర్ క్రైమ్ పోలీసుల ముమ్మర గాలింపు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగరంలో బాంబు పేలుళ్లు జరుపుతామంటూ వచ్చిన బెదిరింపు మెయిల్ తీవ్ర సంచలనం రేపుతోంది. పాకిస్తాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా పేరుతో వచ్చినట్లు చెబుతున్న ఈ మెయిల్‌లో కాచిగూడ రైల్వే స్టేషన్, అక్కడి హోటల్ టూరిస్ట్ ప్లాజాను లక్ష్యంగా చేసుకుని పేలుళ్లు జరుపుతామని హెచ్చరించినట్లు పోలీసులు వెల్లడించారు. అంతేకాకుండా 2008 నవంబర్ 26వ తేదీన ముంబైలో జరిగిన ఉగ్రదాడుల తరహాలో హైదరాబాద్‌లోనూ దాడులు చేస్తామని వార్నింగ్ ఇచ్చారు. కనీసం 300 మందిని చంపుతామని ఈ-మెయిల్‌లో పేర్కొన్నట్లు సమాచారం. కశ్మీర్‌లో లష్కరే తోయిబా ఉగ్రవాది లతీఫ్ భట్ ఎన్‌కౌంటర్‌లో హతమైనందుకు ప్రతీకారంగా

2లో..

గాంధీ భవన్‌లో

కొత్త ఇంఛార్జ్ సందీప్

- సీఎం రేవంత్ ఘనస్వాగతం

2లో..



బిస్లరీ వాటర్‌లో ప్రమాదకర రసాయనాలు

- చర్యలకు సిద్ధమైన ఎఫ్ఎస్ఎస్ఏఐ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) దేశంలో ప్రముఖ ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ తయారీ సంస్థ 'బిస్లరీ ఇంటర్నేషనల్'పై న్యాయపరమైన చర్యలు చేపట్టేందుకు భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ సిద్ధమైంది. ల్యాబొరేటరీ పరీక్షల్లో కంపెనీకి చెందిన నీటి నమూనాలు సురక్షితం కావని తేలడంతో, సంస్థపై ప్రాసిక్యూషన్ ప్రక్రియను ప్రారంభించినట్లు ఎఫ్ఎస్-ఎస్ఏఐ ప్రకటించింది. బిస్లరీ సంస్థకు చెందిన ప్రాంగణం నుంచి సేకరించిన ప్యాకేజ్డ్ తాగునీటి నమూనాలను తొలుత పరీక్షించినప్పుడు, అందులో 'బ్రోమేట్' పరిమాణం నిర్దేశిత పరిమితుల కంటే ఎక్కువగా ఉన్నట్లు వెల్లడైంది. దీంతో ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్-2006 ప్రకారం ఆ నీటిని అన్‌సేఫ్ (సురక్షితం కానిది)గా అధికారులు ప్రకటించారు. అయితే, ప్రాథమిక పరీక్ష ఫలితాలపై బిస్లరీ సంస్థ అప్పీల్ చేయడంతో, ఆ నమూనాలను మరింత సమగ్ర పరిశీలన కోసం రెఫరల్ ఫుడ్ ల్యాబొరేటరీకి పంపించారు.రెండో ల్యాబ్ పరిశీలనలోనూ ఆ నీటి నమూనాలు ప్రమాణాలకు అనుగుణంగా లేవని తేలింది. అంతేకాకుండా, అందులో ప్రమాదకరమైన 'పాలీన్యూక్లియర్ ఆరోమాటిక్ హైడ్రోకార్బన్స్' ఉన్నట్లు నిర్ధారణ అయింది. సాధారణంగా బ్రోమేట్, పీఏహెచ్‌లను

2లో..

టెక్నాలజీతో ఆర్టీసీకి భారీ ఆదా

- రూ.36 కోట్ల డీజిల్ ఖర్చు తగ్గింపు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) అత్యాధునిక టెక్నాలజీని వినియోగించుకుంటూ భారీగా ఇంధనాన్ని ఆదా చేస్తోంది. బస్సు డ్రైవర్ల డ్రైవింగ్ విధానాన్ని పర్యవేక్షించే 'ఐ-అలర్ట్' టెక్నాలజీతో ఇప్పటివరకు సుమారు రూ.36 కోట్ల డీజిల్ ఖర్చును తగ్గించినట్లు టీజీఎస్ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. ఈ ఐ-అలర్ట్ టెక్నాలజీని 1,500 అశోక్ లేలాండ్ బీఎస్-6 బస్సుల్లో ఏర్పాటు చేశారు. దీని ద్వారా ప్రతి నెలా దాదాపు 1.98 లక్షల లీటర్ల హైస్పీడ్ డీజిల్ ఆదా అవుతుండగా ఇంధన ఖర్చులో నెలకు సుమారు రూ.2 కోట్ల వరకు మిగులుతోంది. ఇంధన పొదుపుతో పాటు రోడ్డు భద్రత, పర్యావరణ పరిరక్షణకు కూడా ఈ విధానం దోహదపడుతోందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

2లో..

తెలంగాణలో కాంగ్రెస్‌దే

రెండోసారి అధికారం

మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పీసీసీ కార్యవర్గ సభ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశం అనంతరం సీఎం పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు.

90 రోజుల్లో 48 లక్షల సభ్యత్వాలు.. 64 సీట్ల విజయం

తాను పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో కేసీఆర్ అక్రమ కేసులతో కాంగ్రెస్ నేతలను పార్టీ నుంచి లాక్కున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. అయినప్పటికీ కేవలం 90 రోజుల్లోనే 48 లక్షల డిజిటల్ సభ్యత్వాలు నమోదు చేయించామని గుర్తుచేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో 92,35,833 ఓట్లు సాధించి 64 స్థానాల్లో విజయం సాధించామని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 119 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయని, వచ్చే ఎన్నికల్లో కోటి ఓట్లు సాధించి 90 స్థానాలు గెలుచుకోవడమే లక్ష్యమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకొచ్చేందుకు అవసరమైన వ్యూహాలను తాము సిద్ధం చేస్తామని, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసే బాధ్యత కార్యకర్తలు తీసుకోవాలని సూచించారు.

రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యం

లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి 15 ఎంపీ స్థానాలను గెలుచుకుని రాహుల్ గాంధీని ప్రధానిని చేసేందుకు కాంగ్రెస్ శ్రేణులు కృషి చేయాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. రాజకీయాల్లో ఆత్మవిశ్వాసం, నమ్మకం అత్యంత కీలకమని, అవి ఉంటే వెయ్యి ఏనుగుల బలం వస్తుందని అన్నారు. 2024 ఫిబ్రవరిలో ప్రధాని నరేంద్ర మోదీ బీజేపీ 400కు పైగా స్థానాలు సాధిస్తుందని ప్రకటించినప్పుడే ఆ పార్టీ 240 స్థానాలు కూడా దాటదని తాను అంచనా వేసినట్లు గుర్తుచేశారు. చివరకు బీజేపీ 240 స్థానాల వద్దే నిలిచిందన్నారు. కాంగ్రెస్ నేతల్లో ఆత్మవిశ్వాసం లోపించడం, సరిగా ప్రచారం చేయకపోవడం వల్లే పార్టీ 100 స్థానాల వద్ద ఆగిపోయిందని అభిప్రాయపడ్డారు. బీజేపీకి వచ్చిన మరో 25 స్థానాలు తగ్గి, కాంగ్రెస్‌కు అదనంగా 25 స్థానాలు వచ్చి ఉంటే 125 స్థానాలతో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఉండేదని పేర్కొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ కార్యకర్తలకు సీఎం సూచించారు. రాష్ట్రంలో కోటి కుటుంబాలకు ఇందిరమ్మ జీవిత బీమా కల్పిస్తున్నామని, 52 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. 3.42 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు అందిస్తున్నామని వివరించారు. ప్రభుత్వ పథకాలతో ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను వివరించే బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. గాంధీభవన్ చుట్టూ తిరిగితే పదవులు రావని, ఢిల్లీలో పరిచయాలు ఉన్నాయనే కారణంతో అవకాశాలు దక్కవని స్పష్టం చేశారు. పైరవీల కోసం వెచ్చించే సమయాన్ని ప్రజల కోసం కేటాయించాలని హితవు పలికారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పేదలకు అండగా నిలిచేవారే నిజమైన నాయకులని పేర్కొన్నారు.

ఆరుతడి పంటలే సాగు చేయాలి

ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కాలేదని రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ పరిస్థితుల్లో రైతులు ఆరుతడి పంటలకే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అయితే రాష్ట్రంలో ఆహార ధాన్యాలకు ఎలాంటి కొరత లేదని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా సుమారు 100 దేశాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, తెలంగాణ పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటకలోనూ కరువు పరిస్థితులు నెలకొన్నాయని వివరించారు.

బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లకు హిందూ సంప్రదాయాలపై అవగాహన లేదు

వ్యక్తపరచలేకపోతున్నారని వ్యాఖ్యానించారు. నిజమైన హిందువుగా వారిని ఆ వలయం నుంచి బయటకు తీసుకురావడం తన బాధ్యత అని పేర్కొంటూ బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లపై విమర్శనాస్త్రాలు సంధించారు.

సోనియా ఆత్మకథ వ్యాఖ్యలతో మొదలైన వివాదం

రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నేతలు విమర్శలు చేయడంతో ఈ వివాదం మొదలైంది. గత సోమవారం తన తల్లి సోనియాగాంధీ ఆత్మకథ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో రాహుల్ తన కుటుంబానికి సంబంధించిన ఓ విషయాన్ని గుర్తుచేసుకున్నారు. భోజనం చేసే సమయంలో తన తల్లి సోనియాగాంధీ, తండ్రి రాజీవ్ గాంధీ ఒడిలో కూర్చునేవారని చెప్పారు. తన స్నేహితుల ఇళ్లకు వెళ్లినప్పుడు వారి తల్లిదండ్రులు అలా కూర్చోకపోవడం చూసి ఆశ్చర్యపోయేవాడినని వివరించారు. ఈ వ్యాఖ్యలపై అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మతో పాటు పలువురు బీజేపీ నేతలు 'అర్ధనారీశ్వర' శిల్పం ఫొటోను షేర్ చేస్తూ విమర్శలు చేశారు. తాజాగా ఎలిఫెంటా గుహల్లోని శివపార్వతుల శిల్పాన్ని ప్రస్తావిస్తూ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు బీజేపీ విమర్శలకు కౌంటర్‌గా మారాయి.

మోదీ ఆర్థిక విధానాలపైనా రాహుల్ ధ్వజం

మరోవైపు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆర్థిక విధానాలపైనా రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వేతనాల పెంపు, ఉద్యోగాల కల్పనపై కార్పొరేట్ సంస్థల అధిపతులను ప్రశ్నిస్తూ శనివారం ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) శతాబ్ది సదస్సులో మోదీ చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. ప్రధాని వ్యాఖ్యలు తన ప్రభుత్వ ఆర్థిక విధానాల వైఫల్యాలను స్వయంగా అంగీకరించినట్లుగా ఉన్నాయని విమర్శించారు. పరిశ్రమలకు పన్ను రాయితీలు కల్పిస్తున్నప్పటికీ ఉద్యోగుల వేతనాలు పెంచడం లేదని, తగిన ఉపాధి అవకాశాలు సృష్టించడం లేదని పారిశ్రామికవేత్తలను ప్రధాని ప్రశ్నించడాన్ని రాహుల్ ప్రస్తావించారు. ప్రభుత్వ విధానాలు గుత్తాధిపత్యాలను ప్రోత్సహిస్తున్నాయని, దేశంలో అత్యధిక ఉపాధి కల్పించే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను (ఎంఎస్ఎంఈ) బలహీనపరుస్తున్నాయని ఆరోపించారు. మోదీ, ఆయన సన్నిహితులు కలిసి దేశాన్ని దోచుకుంటున్నారని, ప్రభుత్వ విధానాలపై ఏ వర్గంలోనూ సంతృప్తి లేదని విమర్శించారు.

ఇదే మీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం

ఈ అంశంపై ఎక్స్ వేదికగా స్పందించిన రాహుల్ గాంధీ.. విమానాశ్రయాలు, ఓడరేవులు, గనులు, అడవులు, విద్యుత్, రహదారులు వంటి కీలక రంగాలన్నీ కొందరి గుప్పిట్లో ఉన్నప్పటికీ వారు ఎన్ని ఉద్యోగాలు సృష్టించారని ప్రశ్నించారు. పరిశ్రమలకు ఎంత ఇచ్చినా సరిపోవడం లేదని, పన్ను రాయితీలు అందుతున్నా ఉద్యోగుల వేతనాలు పెంచడం లేదని, ఉపాధి అవకాశాలు కల్పించడం లేదని ప్రధాని స్వయంగా చెబుతున్నారని పేర్కొన్నారు. ఇవి పారిశ్రామికవేత్తలపై ప్రధాని చేసిన ఆరోపణలు కాదని, ఆయన ప్రభుత్వ వైఫల్యాలను ఆయనే అంగీకరించినట్లుగా భావించాలని రాహుల్ వ్యాఖ్యానించారు. దేశ ఆర్థిక వ్యవస్థలో గుత్తాధిపత్య ధోరణులు పెరుగుతున్నాయని, వాటి ప్రభావం ఉద్యోగ కల్పనపై పడుతోందని విమర్శించారు.

గాంధీ భవన్‌లో కొత్త ఇంచార్జ్ సందీప్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల నూతన ఏఐసీసీ ఇంచార్జ్‌గా నియమితులైన బీఎం సందీప్ కుమార్ తొలిసారిగా హైదరాబాద్‌కు విచ్చేశారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, సీడబ్ల్యూసీ సభ్యుడు వంశీచంద్ రెడ్డి, ఎంపీ అనిల్ యాదవ్ సహా పలువురు కాంగ్రెస్ ముఖ్య నేతలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం శంషాబాద్ నుంచి భారీ ర్యాలీగా గాంధీ భవన్‌కు చేరుకున్న సందీప్ కుమార్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు, సీనియర్ నాయకులు సాదరంగా స్వాగతం పలికారు. నేతలు, కార్యకర్తల కోలాహలంతో గాంధీ భవన్ ప్రాంగణం సందడిగా మారింది. స్వాగత కార్యక్రమాల అనంతరం గాంధీ భవన్‌లో తెలంగాణ కాంగ్రెస్ పొలిటికల్ అఫైర్స్ కమిటీ కీలక సమావేశం ప్రారంభమైంది. నూతన ఏఐసీసీ ఇంచార్జ్ బీఎం సందీప్ కుమార్, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు మరియు పీఏసీ సభ్యులు ఈ సమావేశంలో పాల్గొని రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం తదితర కీలక అంశాలపై చర్చించారు.మరోవైపు, ఈ సమావేశానికి హాజరయ్యేందుకు వచ్చిన కాంగ్రెస్ సీనియర్ నేతలను లోపలికి అనుమతించే విషయంలో పోలీసుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తమైంది. భద్రతా కారణాల దృష్ట్యా ఒక గేటు నుంచి మరో గేటుకు తిప్పడంపై మాజీ మంత్రి షబ్బీర్ అలీ, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. "మిమ్మల్ని అడుక్కుని గాంధీ భవన్‌కు రావాలా?" అంటూ వారు పోలీసులను నిలదీశారు. కాలినొప్పితో ఇబ్బంది పడుతూ వచ్చిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సైతం గేట్ల చుట్టూ తిరగాల్సి రావడం చర్చనీయాంశమైంది. పోలీసుల మధ్య సమన్వయ లోపం వల్లే తాము ఇబ్బందులు ఎదుర్కొన్నామని పలువురు నేతలు అసంతృప్తి వ్యక్తం చేశారు.

పంచాయతీ ఎన్నికల్లో పంతాలు వద్దు.. ఏకగ్రీవాలే ముద్దు

ఈ ప్రజాభిప్రాయాన్ని ప్రతిపక్ష వైసీపీ జీర్ణించుకోలేక తప్పుడు ప్రచారానికి దిగుతోందని విమర్శించారు.

ఏకగ్రీవాలతో గ్రామాలకు అదనపు ప్రయోజనం

పార్టీ ప్రాతిపదికన జరిగిన ఎన్నికల పోరు ముగిసిందని, ఇక గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా జరిగే పంచాయతీ ఎన్నికల్లోనూ విజయస్ఫూర్తిని కొనసాగించాలని సీఎం సూచించారు. పంచాయతీ ఎన్నికలు పార్టీ గుర్తులతో సంబంధం లేకుండా జరుగుతాయని, కాబట్టి రాజకీయ ఘర్షణలకు తావివ్వకుండా ఏకగ్రీవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. గ్రామాలు ఏకగ్రీవమైతే ప్రభుత్వం అందించే ప్రత్యేక ఆర్థిక ప్రోత్సాహకాలు అభివృద్ధి పనులకు ఎంతగానో ఉపయోగపడతాయని వివరించారు.గతంలో ఏకగ్రీవ పంచాయతీలకు కనీస ప్రోత్సాహకం రూ.5 లక్షలుగా ఉండగా, దానిని రూ.15 లక్షలకు పెంచామని, గరిష్ఠ ప్రోత్సాహకాన్ని రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షలకు పెంచిన విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆదేశించారు.

జనాభాను బట్టి రూ.15 లక్షల నుంచి రూ.50 లక్షలు

ఏకగ్రీవంగా ఎన్నికయ్యే పంచాయతీలకు జనాభా ఆధారంగా ప్రోత్సాహకాలు అందించనున్నట్లు చంద్రబాబు వివరించారు.– 5 వేలలోపు జనాభా: రూ.15 లక్షలు – 5 వేల నుంచి 10 వేల జనాభా: రూ.25 లక్షలు – 10 వేలకుపైగా జనాభా: రూ.50 లక్షలు ఈ ప్రోత్సాహకాల ద్వారా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు మరిన్ని నిధులు అందుబాటులోకి వస్తాయని, ఈ అంశంపై ప్రజలకు అవగాహన కల్పించాలని నేతలకు సూచించారు.

నేతల మధ్య సమన్వయం బాధ్యత ఎమ్మెల్యేలదే

గ్రామస్థాయిలో పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు నాయకులు పట్టుదలతో ఉంటారని, అలాంటి పరిస్థితుల్లో వారితో చర్చించి ఏకాభిప్రాయం తీసుకురావాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలదేనని చంద్రబాబు స్పష్టం చేశారు. నాయకుల మధ్య వ్యక్తిగత పంతాలు, పట్టింపులు పక్కనపెట్టి ఐక్యతను చాటాలని సూచించారు. జడ్పీ ఎన్నికల ఫలితాల తర్వాత ప్రత్యర్థి పార్టీ పోటీకి పెద్దగా ఆసక్తి చూపడం లేదని పేర్కొన్న సీఎం, అదే సమయంలో సొంత పార్టీలోని నాయకులే రెండు వర్గాలుగా విడిపోయి పోటీ పడే పరిస్థితి రాకుండా జాగ్రత్త వహించాలని హెచ్చరించారు. నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు స్థానిక నాయకులతో సమన్వయం చేసుకుంటూ, గ్రామాల సమగ్ర వికాసానికి ఏకగ్రీవాలే దోహదపడతాయని ప్రజలకు వివరించాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.

కరీంనగర్‌లో కాషాయ దండయాత్ర

ఓటు హక్కు కల్పించాలని కోరుకోవడం మూర్ఖత్వమని వ్యాఖ్యానించారు. ఆదివారం కరీంనగర్‌లోని గురుద్వారాలో ఎంపీ లాడ్స్ నిధులతో ఏర్పాటు చేసిన 11 కేవీ సోలార్ ప్యానెల్‌ను బండి సంజయ్ ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ద్వారా 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, ఒకరి పేరుతో ఉన్న అదనపు ఓట్లను, మరణించిన వారి పేర్లను తొలగించడం లక్ష్యమని వివరించారు. అక్రమంగా ఓటు హక్కు పొందిన విదేశీయులను గుర్తించి తొలగించడంతోపాటు అర్హులైన భారతీయులకు ఓటు హక్కు కల్పించడమే ఈ ప్రక్రియ ఉద్దేశమన్నారు. ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ ప్రజల్లో అపోహలు సృష్టిస్తోందని విమర్శించారు. ప్రధాని, ముఖ్యమంత్రి మొదలుకొని సర్పంచ్, ఎమ్మెల్యే, ఎంపీల వరకు ప్రజాప్రతినిధులను ఎన్నుకునే హక్కు భారత పౌరులకు మాత్రమే ఉందని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీజేపీని చూసి భయపడుతున్నారని, కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి బీజేపీని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని బండి సంజయ్ ఆరోపించారు. కాంగ్రెస్‌కు బీజేపీని ఎదుర్కొనే శక్తి లేదని, రాష్ట్రంలో అభివృద్ధి, కేంద్ర నిధులు రావాలంటే బీజేపీతోనే సాధ్యమని ప్రజలు గుర్తించారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించి తెలంగాణలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు బీజేపీ జాతీయ నాయకత్వం దేశవ్యాప్తంగా 40 ప్రాంతాల్లో మహా పాదయాత్రలు నిర్వహిస్తోందని తెలిపారు. తెలంగాణలో హైదరాబాద్, కరీంనగర్‌లను ఎంపిక చేసినట్లు చెప్పారు.

హైదరాబాద్‌లో జరిగిన పాదయాత్రకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరయ్యారని, కరీంనగర్‌లో జరిగే యాత్రకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు, ఇన్‌ఛార్జి సునీల్ బన్సల్ తదితర నేతలు పాల్గొంటారని వెల్లడించారు. గాంధీ బొమ్మ నుంచి వైశ్యా భవన్, రాజీవ్ చౌక్, టవర్ సర్కిల్, శాస్త్రి రోడ్ మీదుగా కమాన్ చౌరస్తా వరకు యాత్ర సాగుతుందని వివరించారు.తెలంగాణలో సిక్కు కుటుంబాలు ఇళ్లు, ఉపాధి, విద్యా అవకాశాల కొరతతో ఇబ్బందులు పడుతున్నాయని బండి సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. సిక్కు సమాజాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వస్తే వారికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పాకిస్తాన్ డ్రగ్స్ ద్వారా సిక్కు యువతను మత్తుకు బానిసలుగా మార్చేందుకు కుట్ర చేస్తోందని ఆరోపిస్తూ, యువతను మత్తు పదార్థాల నుంచి కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ చేపట్టిన 'నషా ముక్త్ భారత్' కార్యక్రమానికి మద్దతు ఇవ్వాలని కోరారు.

బిస్లెరీ వాటర్‌లో ప్రమాదకర రసాయనాలు

క్యాన్సర్‌కు కారణమయ్యే రసాయనాలు (కార్సినోజెన్లు)గా పరిగణిస్తారు. ఈ ల్యాబ్ నివేదికల ఆధారంగా నిబంధనల ఉల్లంఘన స్పష్టంగా రుజువు కావడంతో, బిస్లెరీ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్‌పై ఫుడ్ సేఫ్టీ చట్టం కింద ప్రాసిక్యూషన్ చర్యలు ప్రారంభించేందుకు అనుమతి మంజూరు చేసినట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ తెలిపింది. కాగా, ఈ పరిణామంపై బిస్లెరీ సంస్థ ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.

మరోవైపు, ప్రఖ్యాత మిఠాయిల తయారీ సంస్థ 'ఆశా కన్ఫెక్షనరీ'కి చెందిన ప్రీ-ప్యాక్డ్ చాక్లెట్-ఫిల్డ్ కుకీల బ్యాచ్‌ను వెంటనే మార్కెట్ నుంచి రీకాల్ చేయాలని ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశాలు జారీ చేసింది. ఆ ఉత్పత్తి లేబులింగ్, పదార్థాల నాణ్యత, భద్రతా ప్రమాణాల్లో లోపాలు ఉన్నట్లు తేలింది. పరీక్షల్లో ఆ కుకీలలో లేబుల్‌పై ప్రస్తావించని 'కార్మోసిన్' అనే సింథటిక్ రంగును గుర్తించారు. అంతేకాకుండా అనుమతించిన స్థాయి కంటే ఎక్కువగా 'టార్ట్రాజైన్', ఈ తరహా ఆహార పదార్థాల్లో అస్సలు ఉపయోగించకూడని 'సన్‌సెట్ ఎల్లో ఎఫ్‌సీఎఫ్' రంగును వాడినట్లు అధికారులు కనుగొన్నారు. దీంతో ఈ ఉత్పత్తిని నిబంధనలకు విరుద్ధమైనదిగా, నాణ్యతా లోపంతో కూడినదిగా పేర్కొంటూ, మార్కెట్లో ఉన్న ప్రభావిత బ్యాచ్ మొత్తాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సంస్థను ఆదేశించింది.

టెక్నాలజీతో ఆర్టీసీకి భారీ ఆదా

డీజిల్ వినియోగాన్ని తగ్గించడంతోపాటు డ్రైవర్ల పనితీరును మెరుగుపరిచేందుకు టీజీఎస్ఆర్టీసీ ఐ-అలర్ట్ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం సంస్థ పరిధిలోని 1500 అశోక్ లేలాండ్ బీఎస్-6 బస్సుల్లో ఈ ఐ-అలర్ట్ వ్యవస్థ పనిచేస్తోంది. దేశంలోని రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థల్లో ఈ టెక్నాలజీని తొలిసారిగా వినియోగిస్తున్న సంస్థగా టీజీఎస్ఆర్టీసీ నిలిచిందని అధికారులు తెలిపారు. ఈ టెక్నాలజీ ద్వారా ప్రతి నెలా సుమారు 1,98,090 లీటర్ల డీజిల్ ఆదా అవుతోంది.

దీనివల్ల నెలకు దాదాపు రూ.2 కోట్ల ఇంధన వ్యయం తగ్గుతోంది. మొత్తంగా ఇప్పటివరకు సుమారు రూ.36 కోట్ల విలువైన డీజిల్ ఖర్చును ఆదా చేసినట్లు ఆ సంస్థ వెల్లడించింది.ఈ ఐ-అలర్ట్ వ్యవస్థ బస్సు డ్రైవర్ల డ్రైవింగ్ తీరును ఎప్పటికప్పుడు విశ్లేషిస్తుంది. గేర్ ఎంపిక, నిర్దేశించిన గ్రీన్ బ్యాండ్ ఆర్పీఎం పరిధిలో బస్సు నడపడం, ఎకానమీ గేర్ల వినియోగం, అనవసరంగా ఇంజిన్‌ను ఆన్‌లో ఉంచడం, అతివేగం, సరైన పద్ధతిలో బ్రేకులు ఉపయోగిస్తున్నారా లేదా వంటి అంశాలను ఈ టెక్నాలజీ పర్యవేక్షిస్తుంది. డ్రైవర్ విధి ముగిసిన తర్వాత ఐ-అలర్ట్ రూపొందించిన పనితీరు నివేదిక ఆధారంగా వ్యక్తిగతంగా విశ్లేషణ చేస్తారు. డ్రైవింగ్ సామర్థ్యాన్ని బట్టి గ్రేడ్లు కేటాయిస్తారు. లోపాలను గుర్తించి ఎప్పటికప్పుడు సూచనలు, శిక్షణ అందిస్తారు. శాస్త్రీయమైన డ్రైవింగ్ పద్ధతులను పాటించేలా డ్రైవర్లను ప్రోత్సహిస్తున్నారు. తద్వారా ఇంధన పొదుపుతోపాటు ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణాన్ని అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఐ-అలర్ట్ టెక్నాలజీతో డీజిల్ వినియోగం తగ్గడంతో కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలు కూడా తగ్గుతున్నాయని టీజీఎస్ఆర్టీసీ అధికారులు తెలిపారు. ప్రతి నెలా సుమారు 507.11 మెట్రిక్ టన్నుల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలను తగ్గించగలుగుతున్నట్లు పేర్కొన్నారు. ఏడాది కాలానికి ఈ తగ్గింపు 6,169.84 మెట్రిక్ టన్నులుగా ఉంటుందని అంచనా వేశారు. ఇంధన పొదుపు, పర్యావరణ పరిరక్షణ రెండింటికీ ఉపయోగపడుతున్న ఈ విధానం సంస్థకు ఆర్థికంగా కూడా ప్రయోజనం చేకూరుస్తోంది.టీజీఎస్ఆర్టీసీ అమలు చేస్తున్న ఐ-అలర్ట్ టెక్నాలజీపై పొరుగు రాష్ట్రాల రవాణా సంస్థలు కూడా ఆసక్తి చూపుతున్నాయి. ఈ వ్యవస్థ పనితీరు, ఫలితాల గురించి తెలుసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ), కర్ణాటక రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (కేఎస్ఆర్టీసీ) అధికారులు టీజీఎస్ఆర్టీసీ అధికారులను సంప్రదించినట్లు వెల్లడించారు. ఈ ఐ-అలర్ట్ టెక్నాలజీని విజయవంతంగా అమలు చేస్తున్న ఇంజినీరింగ్ విభాగాన్ని టీజీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అనిల్ కుమార్ అభినందించారు. ప్రయాణికులకు మరింత సురక్షితమైన, సౌకర్యవంతమైన సేవలు అందించేందుకు సంస్థలో ఆధునిక సాంకేతికతను నిరంతరం అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. సంస్థ పనితీరు, సేవల నాణ్యత మెరుగుపడేలా ఇతర విభాగాలు కూడా ఆధునిక టెక్నాలజీని వినియోగించుకోవాలని సూచించారు.

కాంగ్రెస్ సర్కారుకు కౌంట్‌డౌన్ మొదలైంది

కాంగ్రెస్ పాలనలో అవినీతి రాజ్యమేలుతోంది

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో అవినీతి అనేక రూపాల్లో విజృంభిస్తోందని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలే రాష్ట్రంలో రూ.5 లక్షల కోట్ల నుంచి రూ.10 లక్షల కోట్ల వరకు వసూళ్లు జరుగుతున్నాయని చెబుతున్నారని ఆరోపించారు. పనులు జరగాలంటే 20 శాతం కమీషన్ చెల్లించాల్సి వస్తోందని మరో ఎమ్మెల్యే వెల్లడించారని పేర్కొన్నారు. పారిశ్రామికవేత్తలపై ఒత్తిడి తెచ్చి వందల కోట్ల రూపాయలు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలను మాజీ మంత్రి కొండా సురేఖ కుమార్తె స్వయంగా వెల్లడించారని అన్నారు. రాష్ట్రంలో ప్రజాపాలన కంటే పర్సంటేజీల పాలనే ఎక్కువగా కనిపిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ హామీల అమలుపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా సీఎం రేవంత్ రెడ్డి వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు.

విద్యా వ్యవస్థను ప్రైవేట్ ప్రయోజనాలకు బలి చేస్తున్నారా?

రేవంత్ రెడ్డి, పొంగులేటి కుటుంబాలకు చెందిన ప్రైవేట్ విద్యా వ్యాపారాల ప్రయోజనాల కోసమే ఇంటర్మీడియట్ వ్యవస్థను రద్దు చేసే కుట్ర జరుగుతోందని కేటీఆర్ ఆరోపించారు. విద్యార్థులు, విద్యా వ్యవస్థ ప్రయోజనాలను పక్కనపెట్టి ప్రైవేట్ సంస్థలకు మేలు చేసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు.

వరంగల్‌కు కాంగ్రెస్ చేసిందేమిటి?

మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో వరంగల్‌కు సంక్షేమం, అభివృద్ధి రెండింటిలోనూ నిరాశే మిగిలిందని కేటీఆర్ అన్నారు. ఒక్క కొత్త ఐటీ కంపెనీని, ఒక్క కొత్త టెక్స్‌టైల్ పరిశ్రమను కూడా తీసుకురాలేకపోయారని విమర్శించారు. ఇప్పటికే ఉన్న పరిశ్రమలు సైతం మూతపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వరంగల్‌లో 90 శాతం పూర్తయిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి మిగిలిన 10 శాతం పనులను కూడా మూడేళ్లలో పూర్తి చేయలేకపోయారని మండిపడ్డారు. పేదలకు ఉపయోగపడే ప్రభుత్వ ఆసుపత్రిని పూర్తి చేయడంపై దృష్టి పెట్టకుండా సీఎం రేవంత్ రెడ్డి తన సొంత మెడికవర్ ఆసుపత్రి ప్రారంభోత్సవాలకు ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు.

ఫ్యూచర్ సిటీ కాదు.. ఫ్యూచర్ ఉన్న వరంగల్‌పై దృష్టి పెట్టండి

రాష్ట్ర ప్రభుత్వం ఫ్యూచర్ సిటీపై చూపిస్తున్న శ్రద్ధలో కొంతైనా భవిష్యత్తు అవకాశాలున్న వరంగల్‌పై పెట్టాలని కేటీఆర్ సూచించారు. ఫార్మా సిటీ పేరును ఫ్యూచర్ సిటీగా మార్చి ప్రచారం చేసుకోవడం అభివృద్ధి కాదని ఎద్దేవా చేశారు. వరంగల్‌ను భవిష్యత్తులో ప్రధాన ఐటీ, పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దే బాధ్యతను బీఆర్ఎస్ తీసుకుంటుందని స్పష్టం చేశారు.

బీఆర్ఎస్‌లోకి గౌరు తిరుపతి రెడ్డి

వరంగల్ కేడీసీ గ్రౌండ్‌లో జరిగిన జన చైతన్య సభలో ఏకశిలా విద్యాసంస్థల అధినేత గౌరు తిరుపతి రెడ్డి తన అనుచరులు, వివిధ రంగాలకు చెందిన మేధావులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, టి. రాజయ్య, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్ రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, నన్నపునేని నరేందర్, చల్లా ధర్మారెడ్డి, ఆరూరి రమేష్, బాల్క సుమన్, రెడ్యానాయక్, గండ్ర వెంకటరమణ రెడ్డి, ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి, సీనియర్ నాయకులు రాకేష్ రెడ్డ

భళా.. బాపట్ల బ్లాక్ రైస్!



బీపీటీ 2841 రకం నల్ల బియ్యం వంగడాన్ని బాపట్ల వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. రోగనిరోధక శక్తిని పెంపొందించే యాంటీ ఆక్సిడెంట్లతో పాటు ఐరన్, జింక్ వంటి సూక్ష్మపోషకాలను పుష్కలంగా కలిగి ఉండటం.. పంట పడిపోకుండా ఉండటం, చీడపీడలను తట్టుకోవటం, ఎకరానికి 30-35 బస్తాల దిగుబడినివ్వటం దీని ప్రత్యేకతలు. రైతుల పొలాల్లో ప్రయోగాత్మకంగా సాగు చేయించగా వరుసగా మూడేళ్లు సత్ఫలితాలు వచ్చాయి. కేంద్రీయ/ప్రకృతి సేద్యానికి అనువైన ఈ విశిష్ట వంగడం అధికారిక విడుదలకు సిద్ధమవుతోంది. ఆరోగ్యకరమైన ఆహారం గురించి వినియోగదారుల్లో ఇటీవల అవగాహన పెరగడం, ప్రజల కొనుగోలు శక్తి పెరగడం వలన పోషకాలు కలిగిన ఆహార పదార్థాల వాడకం పెరిగింది.

సేంద్రియ ఆహారోత్పత్తులపై కొనుగోలుదారులు ఆసక్తి చూపుతున్నందున నలుపు, ఎరుపు దేశవాళీ వరి రకాల సాగు, వాడకం క్రమక్రమంగా పెరుగుతోంది. కోతకు ముందు పడిపోవటం, దిగుబడులు తక్కువగా ఉండటం వంటి సమస్యలను తట్టుకునే సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ పూర్వరంగంలో బాపట్ల వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు ఎకరానికి 30-35 బస్తాల దిగుబడినిచ్చే బీపీటీ 2841 బ్లాక్ రైస్ వంగడాన్ని అభివృద్ధి చేయటం విశేషం.

130-140 రోజుల పంట యం.టి.యు. 7029, ఐ.ఆర్.జి.సి. 18195, యం.టి.యు. 1081 అనే రకాల సంకరం ద్వారా బీపీటీ 2841 సన్న రకం బ్లాక్ రైస్ వంగడాన్ని శాస్త్రవేత్తలు రూపొందించారు. డా. బి. కృష్ణవేణి, డా. డి. సందీప్ రాజా, డా. సి.వి. రామారావు, డా. వై. సునీత, డా. కె.ఎ. మృదుల ఈ వంగడాన్ని అభివృద్ధి చేశారు. 2019-20 ఖరీఫ్ సీజను నుంచి రైతు క్షేత్రాల్లో మినీ కిట్ పరీక్షల నిర్వహణకు అనుమతి పొందింది.దీని పంట కాలం 130-140 రోజులు. ఈ రకం దాదాపు 110 సెం.మీ. ఎత్తు పెరుగుతుంది. పడిపోదు. దోమపోటు, అగ్గి తెగుళ్లను కొంత వరకు తట్టుకుంటుంది. మధ్యస్త సన్న రకం. వెయ్యి గింజల బరువు సుమారు 14-14.5 గ్రాములు. పైపొట్టును మాత్రమే తొలగించినప్పుడు (దంపుడు బియ్యం) 76.6% రికవరీనిస్తుంది. పాలీష్ చేస్తే 66% రికవరీనిస్తుంది. దంపుడు బియ్యం తింటే దీనిలోని యాంటీ ఆక్సిడెంట్లు, ఇతర పోషకాలన్నీ శరీరానికి అందుతాయి. పాలీష్ చేస్తే పై పొరలలోని నలుపు రంగులో ఉండే అంథోసైనిన్ తవుడులోకి వెళ్లి పోతుంది.

ఎకరానికి 35 బస్తాల దిగుబడి బీపీటీ 2841 రకం నారును 20"15 సె.మీ. దూరంలో నాటుకుంటే హెక్టారుకు 6 టన్నుల వరకు దిగుబడినిస్తుంది. అయితే, పిలక చేసే సామర్థ్యం తక్కువ కాబట్టి 15"15 సె.మీ. దూరంలో నాటుకుంటే (ఎకరానికి 20-25 కిలోల విత్తనం అవసరం) మంచిదని, ఇలా చేస్తే ఎకరానికి 35 బస్తాల (హెక్టారుకు 6.5 టన్నుల) వరకు దిగుబడి సాధించవచ్చని రైతుల అనుభవాల్లో తేలిందని బాపట్ల ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త, చెప్పారు.

రోగనిరోధక శక్తే కీలకం బీపీటీ 2841 సన్న వరి బియ్యం రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయి. ఈ బియ్యం పైపొర నలుపు రంగులో ఉంటుంది. బియ్యానికి పై పొరలలోని నలుపు రంగు అంథోసైనిన్ అనే పదార్థం వల్ల వస్తుంది. మామూలుగా మనం రోజూ ఆహారంగా తీసుకునే వరి రకాలతో పోల్చినప్పుడు నలుపు, ఊదా, ఎరుపు రంగు పై పొరగా కలిగినటువంటి వరి రకాలలో పాలీఫినాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువ పరిమాణంలో ఉంటాయి.నలుపు రంగు బియ్యం పై పొరలలో ఉండే దట్టమైన నలుపు రంగునిచ్చే ఆంథోసైనిన్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, సూపర్ ఫుడ్‌గా పిలవబడే బ్లూబెర్రీస్, బ్లాక్ బెర్రీస్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లతో సమానమైన పోషక విలువలను కలిగి ఉన్నట్లు ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. బీపీటీ 5204తో పోల్చితే యాంటీ ఆక్సిడెంట్లు బీపీటీ 2841 బ్లాక్ రైస్‌లో 3-4 రెట్లు ఎక్కువగా ఉన్నాయి. పాలీష్ చేయని బీపీటీ 2841 దంపుడు బియ్యంలో వంద గ్రాములకు 90.52 మిల్లీ గ్రాముల ఫినాలిక్ పదార్థాలు, వంద గ్రాములకు 110.52 మిల్లీ గ్రాముల యాంటీ ఆక్సిడెంట్ యాక్టివిటీ ఉన్నట్లు కోత బాపట్లలోని అనంతర సాంకేతిక పరిజ్ఞాన కేంద్రం ప్రయోగశాల పరీక్షల్లో వెల్లడైంది.5% పాలీష్ చేసిన బీపీటీ 2841 నల్ల బియ్యంలో కూడా వంద గ్రాములకు 90.19 మిల్లీ గ్రాముల యాంటీ ఆక్సిడెంట్ యాక్టివిటీ ఉన్నట్లు తేలింది. అదే విధంగా, పై పొట్టు మాత్రమే తొలగించిన ముడి బియ్యంలో 11.02%, పాలీష్ బియ్యంలో 6.3% మాంసకృత్తులున్నాయి. సూక్ష్మపోషకాలైన జింక్, ఇనుప ధాతువులు కూడా బీపీటీ 2841లో ఎక్కువ పరిమాణంలో ఉండటం విశేషం. యాంటీ ఆక్సిడెంట్ యాక్టివిటీ ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలను ఆహారంగా తీసుకున్నప్పుడు అవి శరీరంలో ఉత్పత్తయిన ఫ్రీరాడికల్స్‌ను సమతుల్యం చేయటం వలన పలు రకాల కేన్సర్లు, గుండె సంబంధిత సమస్య, మధుమేహం వంటి దీర్ఘకాలిక రుగ్మతలను ఎదుర్కొనే రోగనిరోధక శక్తి పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు.

అన్వి... అన్నీ విశేషాలే!



లండన్, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు దక్కించుకుంది. రెండున్నరేళ్ల పాప ఇన్ని రికార్డులు సాధించిందంటే చాలా విచిత్రంగా ఉన్నప్పటికీ ఇది అక్షరాలా నిజం. అన్వి పెయింటింగ్ జర్నీ కేవలం తొమ్మిది నెలల వయసులోనే జరగడం విశేషం. అప్పటినుంచి పెయింటింగ్స్ వేస్తూనే ఉంది."మ్యాగ్నెంట్, పెండులమ్, కలర్స్ ఆన్ వీల్స్, రిఫ్లెక్షన్ ఆర్ట్, హెయిర్ కాంబ్ టెక్చర్, రీ సైక్లింగ్ ఓల్డ్ టాయిస్, హ్యూమన్ స్పైరోగ్రఫీ, దియా స్ప్రే పెయింటింగ్, బబుల్ పెయింటింగ్" వంటి 37 రకాల పెయింటింగ్ టెక్నిక్స్‌ను ఆపోశన పట్టింది. పెయింటింగేగాక పంతొమ్మిది నెలల వయసు నుంచే స్పానిష్ భాషలో మాట్లాడడం ప్రారంభించింది.

42 అక్షర మాల శబ్దాలను స్పష్టంగా పలుకుతూ 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు దక్కించుకుంది. అత్యంత అరుదైన చిన్నారులు మాత్రమే ఇవన్నీ చేయగలుగుతారు.అన్నట్లు అన్వి అందర్నీ అబ్బురపరుస్తోంది.

సులువులైన చిట్కాలతో చాక్లెట్ సమోసా-అంజీర్ హల్వా




పొడి 5 టేబుల్ స్పూన్లు, నెయ్యి 2 టేబుల్ స్పూన్లు, డార్క్ చాక్లెట్ పౌడర్ 1 కప్పు, పిస్తా ముక్కలు 1 టేబుల్ స్పూన్‌పంచదార పాకం అభిరుచిని బట్టి (అప్పటికప్పుడు కావాల్సినంత పంచదార, నీళ్లు పోసుకుని స్టవ్ మీద పెట్టుకోవాలి), నీళ్లు సరిపడాతయారీ: ముందుగా ఒక బౌల్‌లో మైదాపిండి, నెయ్యి, 4 టేబుల్ స్పూన్ల పంచదార పొడి, నీళ్లు పోసుకుని బాగా కలిపి.. కొద్దికొద్దిగా నీళ్లు కలుపుకుంటూ చపాతీ ముద్దలా చేసుకుని ఓ పావు గంట పాటు ఫ్రిజ్‌లో పెట్టుకోవాలి.ఈ సమయంలో ఒక బౌల్ తీసుకుని అందులో చాక్లెట్ పౌడర్, పంచదార పౌడర్, పిస్తా ముక్కలు వేసుకుని అటు ఇటుగా కలిపి.. పక్కన పెట్టుకోవాలి. పావు గంట తర్వాత ఫ్రిజ్‌లోంచి మైదా ముద్దను తీసి.. చిన్న చిన్న పూరీల్లా చేసుకుని.. ప్రతి పూరీలో కొంత చాక్లెట్ మిశ్రమం పెట్టుకుని సమోసాలా చుట్టుకోవాలి. అనంతరం రెండు స్టవ్‌లు ఆన్ చేసుకుని.. ఒకవైపు నూనె కళాయి, మరోవైపు పంచదార పాకం ఉన్న కళాయి పెట్టుకుని సమోసాలను నూనెలో దోరగా వేయించి.. వెంటనే పాకంలో వేసి తీసుకోవాలి. ఒకవేళ పాకంలో వేసుకోవడం ఇష్టం లేకుంటే చాక్లెట్ సాస్‌ని పైన గార్నిష్ చేసుకుని సర్వ్ చేసుకోవచ్చు.

అంజీర్ హల్వా కావలసినవి: డ్రై అంజీర్ 400 గ్రా.(నానబెట్టి, ముక్కలు చేసుకోవాలి) బియ్యప్పిండి/మొక్కజొన్న పిండి 5 టేబుల్ స్పూన్లు(5 టేబుల్ స్పూన్ల నీళ్లనూ జతచేసి బాగా కలుపుకోవాలి), నెయ్యి 9 టేబుల్ స్పూన్లు లేదా అంతకు మించి, పచ్చిపాలు అర కప్పు, పంచదార అభిరుచిని బట్టి, ఫుడ్ కలర్ కొద్దిగా (గ్రీన్ కలర్), యాలకుల పొడి కొద్దిగా, డ్రై ఫ్రూట్స్ ముక్కలు తయారీ: ముందుగా పాన్ లో 2 టేబుల్ స్పూన్ల నెయ్యి వేసుకుని, వేడి కాగానే.. అందులో బియ్యప్పిండి /మొక్కజొన్నపిండి మిశ్రమం వేసుకుని గరిటెతో తిప్పుతూ ఉండాలి. పాలు పోసుకుని చిన్న మంటపైన గరిటెతో తిప్పుతూ మరిగించుకోవాలి. తర్వాత



కావలసినవి: మైదా పిండి - 1 కప్పు, పంచదార



ఒక కప్పు పంచదార వేసుకుని కరిగే వరకూ గరిటెతో తిప్పుతూ ఉండాలి. అందులో అంజీర్ ముక్కలు, ఫుడ్ కలర్ వేసుకుని మధ్య మధ్యలో కొద్దికొద్దిగా నెయ్యి వేసుకుంటూ తిప్పుతూ ఉండాలి. దగ్గర పడిన తర్వాత ఒకసారి తీపి సరిపోయిందో లేదో చూసుకుని అవసరమైతే మరికొద్దిగా పంచదార వేసుకుని, మిగిలిన నెయ్యి కూడా వేసుకుని గరిటెతో కలుపుతూ దగ్గర పడే సమయంలో యాలకుల పొడి వేసుకుని స్టవ్ ఆఫ్ చేసుకోవాలి. అభిరుచిని బట్టి నచ్చిన డ్రై ఫ్రూట్స్ ముక్కలతో గార్నిష్ చేసుకోవచ్చు లేదా.. నచ్చిన ఫ్లేవర్ ఐస్ క్రీమ్‌తో కలిసి తింటే భలే రుచిగా ఉంటుంది ఈ హల్వా.

పీయూష్, ఆమ్‌కా పన్నా, జల్‌జీరాతో కడుపు చల్లగా..



మిల్క్‌షేక్, ఐస్‌క్రీమ్‌ల వంటి వాటిలోనూ అదనపు రుచికోసం ఉపయోగిస్తారు. ఘజియాబాద్‌కు చెందిన హఫీజ్ అబ్దుల్ మజీద్ అనే యునాని వైద్యుడు శతాబ్ది కిందట రూపొందించిన 'రూఫ్ అఫ్జా' భారత ఉపఖండమంతటా విరివిగా వినియోగంలో ఉంది.

కొన్ని ప్రాంతాల్లో చందనం పొడి, కుంకుమపువ్వు, పంచదార, నిమ్మరసం కలిపి తయారు చేసే చందన షర్బత్‌ను కూడా వేసవి పానీయంగా సేవిస్తారు.

ఇవన్నీ ఆరోగ్యానికి ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా, వేసవితాపాన్ని తీర్చడంలో బాగా దోహ దపడతాయి.

ఈ వేసవిలో మీరూ వీటి రుచులను ఆస్వాదించండి.



మహారాష్ట్ర, గుజరాత్ ప్రాంతాల్లో వేసవిలో 'పీయూష్' అనే పానీయాన్ని విరివిగా తాగుతారు. దాదాపు దీని తయారీ లస్సీ మాదిరిగానే ఉంటుంది. బాగా చిలికిన పెరుగులో పంచదారతో పాటు శ్రీఖండ్ అనే సంప్రదాయ మిఠాయిని, జాజికాయ పొడి, ఏలకుల పొడి వంటివి చేర్చడం వల్ల దీనికొక విలక్షణమైన రుచి ఏర్పడుతుంది.

'పీయూషం' అంటే అమృతం అనే అర్థం ఉంది. 'పీయూష్' పానీయం అమృతసమానంగా ఉంటుందని మరాఠీ, గుజరాతీ ప్రజలు చెబుతారు.ఉత్తరాది రాష్ట్రాల్లో జల్‌జీరా, ఆమ్ కా పన్నా, ఖస్‌ఖస్, రూహ్ అఫ్జా వంటి సంప్రదాయ పానీయాలను వేసవిలో విరివిగా వినియోగిస్తారు. జీలకర్ర, మిరియాలు వంటివి కలిపి తయారుచేసే జల్‌జీరాను సాధారణంగా భోజనానికి ముందు సేవిస్తారు. దీనివల్ల అలసట తీరి, ఆకలి పుడుతుందని, జీర్ణశక్తి మెరుగుపడుతుందని చెబుతారు. పచ్చి మామిడికాయలతో తయారుచేసే ఆమ్ కా పన్నా, వట్టివేళ్లు, గసగసాలు కలిపి తయారుచేసే ఖస్‌ఖస్ పానీయాలను కొన్ని ప్రాంతాల్లో ఇష్టంగా సేవిస్తారు. గులాబీరేకుల కషాయానికి చక్కెర పాకాన్ని జోడించి తయారు చేసే 'రూహ్ అఫ్జా'తో నేరుగా షర్బత్ తయారు చేసుకోవడమే కాకుండా, దీనిని లస్సీ,

తల తిరగడం కూడా గుండె వైఫల్యానికి సంకేతమే!



మారుతున్న జీవనశైలి కారణంగా ప్రస్తుతం చాలామంది అధిక బీపీతో బాధపడుతున్నారు. దీనిని ఆహారంతోనే అదుపు చేయవచ్చు. గుమ్మడి గింజల్లో ఎన్నో పోషకాలు ఉంటాయి. వీటిని తినడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. పొటాషియం, మెగ్నీషియం ఇందులో ఎక్కువగా ఉంటాయి. ఇవి రక్తపోటును అదుపులో ఉంచుతాయి. చేపలలో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. ఇవి మన హృదయాన్ని ఫిట్‌గా ఉంచుతాయి. రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి.

మీకు తెలుసా?

తల తిరగడం కూడా గుండె వైఫల్యానికి సంకేతం. డీ హైడ్రేషన్ వల్ల మైకం వచ్చి గుండె పనిచేయదు. గొంతు లేదా దవడలో నొప్పి కూడా గుండెపోటుకు సంకేతం. అయితే అన్ని నొప్పులు గుండెనొప్పులకి కారణమని చెప్పలేం. కొన్నిసార్లు ఇది జలుబు లేదా సైనస్ కారణంగా వస్తుంది.కానీ కొన్నిసార్లు ఛాతీ నొప్పి గొంతు నుంచి దవడకు వ్యాపిస్తుంది. ఇది చాలా ప్రమాదం. మీరు చాలా త్వరగా అలసిపోయినట్లనిపిస్తే బలహీనతగా భావించకండి. ఎందుకంటే ఇది కూడా గుండెపోటుకు కారణమయ్యే లక్షణాలలో ఒకటని గుర్తుంచుకోండి.

చెమట కాయలా?

చందనం పొడి, వట్టివేళ్ల పొడిని రోజ్‌వాటర్‌లో కలిపి..



ఎండలు మండుతున్నాయి. దీంతో విపరీతమైన చెమట, దురదలతో చాలా ఇబ్బంది పడిపోతుంటారు. చర్మం తన మృదుత్వాన్ని కూడా కోల్పోతుంది. చెమటకాయలు దురదకు కారణమై, చికాకు, ఆయా భాగాలలో మంట, నొప్పికి దారితీస్తాయి. అతిగా చెమట పట్టే వారిలో వీటి సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది.సాధారణంగా నుదుటిపై, ముఖం, మెడ, వీపు, ఛాతీ, తొడల మీద చెమట కాయలు వస్తుంటాయి. వీటి తీవ్రత ఎక్కువైతే చర్మం ఎర్రపొక్కులుగా మారటం, గోకటం వల్ల చర్మం చిట్లి రక్తం కారడం జరుగుతుంది. కొన్ని చిట్కాలతో కొంత ఉపశమనం పొందవచ్చు. అవేంటో చూద్దాం. ?రెండు పూటలా స్నానం చేస్తూ శరీరాన్ని శుభ్రంగా వుంచుకోవాలి. చెమట ఎక్కువగా పట్టినప్పుడు స్నానం చేయడం, లేదా తడి వస్త్రంతో శరీరాన్ని తుడవడం తప్పనిసరి. వదులుగా ఉండే పల్చని కాటన్ వస్త్రాలు వేసుకోవాలి. నీళ్లు బాగా తాగాలి. దాంతో శరీరం చల్లగా ఉంటుంది. వీలైనంత వరకు ఎండలోకి వెళ్లకుండా చూసుకోవాలి.స్నానం చేసే నీటిలో గుప్పెడు మల్లెపూలు, జాజిపూలు లేదా వట్టివేళ్ల చూర్ణం వేసి గంటసేపు నాననిచ్చి, ఆ నీటితో స్నానం చేయడం మంచిది. ఇటువంటి స్నానం శరీరాన్ని చల్లగా ఉంచుతుంది.వంటినిండా చెమటకాయలు వచ్చినప్పుడు గంధం ముద్దని పేలిన చోట పల్చని పూతలా వేసుకుంటే, మంట, దురద తగ్గుతాయి. ఇందులో కర్పూరాన్ని కలిపి పేలిన చోట లేపనంలా రాసినా కూడా సమస్య అదుపులోకి వస్తుంది. మార్కెట్లో లభ్యమయ్యే గంధం పొడిలో సహజత్వం ఉండదు. అందుకే గంధపు చెక్కని సానపై అరగదీసి, దాన్ని వాడటం శ్రేయస్కరం.చందనం పొడి, వట్టివేళ్ల పొడిని రోజ్‌వాటర్‌లో కలిపి పల్చని లేపనంలా చెమట కాయలపై రాసినా మంచిదే. కలబంద గుజ్జుని రాసుకున్నా కూడా చెమటకాయల నుంచి ఉపశమనం కలుగుతుంది. తాటి ముంజెలలోని నీటిని చెమట కాయలపై రాసి, ఆరిన తర్వాత శుభ్రమైన వస్త్రంతో మృదువుగా తుడిచేయాలి. పుచ్చకాయ, కర్బూజా, కీరదోస, ముంజెలు, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, పల్చని మజ్జిగ... వంటి చలువచేసే పదార్థాలు వీలైనంత ఎక్కువగా తీసుకోవాలి. కారం, గరం మసాలా, నూనెలో వేయించిన పదార్థాలకు దూరంగా ఉండాలి.

కార్తీక రెండో సోమవారం..

శ్రీశైలంలో లక్షదీపోత్సవం

పుష్కరిణి వద్ద దశవిధ హారతులు

భక్తిభావంతో వెలిగిపోనున్న పుణ్యక్షేత్రం



శ్రీశైలం(ప్రశ్న న్యూస్) కార్తీకమాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకుని శ్రీశైల మహాక్షేత్రం ఆధ్యాత్మిక శోభను సంతరించుకోనుంది. లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ సోమవారం (నవంబర్ 23) దేవస్థానం ఆధ్వర్యంలో లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించనున్నారు. పుష్కరిణి ప్రాంగణమంతా దీపాలతో అలంకరించి భక్తులకు కనులపండువగా



దీపోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6.30 గంటల నుంచి శాస్త్రోక్తంగా దశవిధ హారతులు సమర్పించనున్నారు. ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు, ఈఓ యం. శ్రీనివాసరావు ఈ వివరాలు వెల్లడించారు.

వైభవంగా దశవిధ హారతులు..

పుష్కరిణి వద్ద ముందుగా శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులను వేంచేపు చేయించి విశేష పూజలు నిర్వహిస్తారు. అనంతరం స్వామి, అమ్మవార్లతో పాటు పుష్కరిణికి పది రకాల హారతులను సమర్పిస్తారు. ఓంకార, నాగ, త్రిశూల, నంది, సింహ, సూర్య, చంద్ర, కుంభ, నక్షత్ర, కర్పూర హారతులతో పుష్కరిణి ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకోనుంది.

హారతుల దర్శనంతో విశేష ఫలితాలు...

దశవిధ హారతులకు ఆధ్యాత్మికంగా విశేష ప్రాధాన్యం ఉంది. ఓంకార హారతి దర్శనం సకల శుభాలను ప్రసాదిస్తుందని, నాగహారతి సర్పదోష నివారణకు, సంతానప్రాప్తికి ప్రతీకగా భావిస్తారు. త్రిశూల హారతి గ్రహదోషాలు, అపమృత్యు భయాలను తొలగిస్తుందని భక్తుల విశ్వాసం. నంది హారతి భయదుఃఖాలను దూరం చేసి ఆనందాన్ని, సింహహారతి శత్రుబాధల నుంచి విముక్తిని, మనోధైర్యాన్ని ప్రసాదిస్తుందని చెబుతారు.సూర్యహారతి ఆరోగ్యం, దీర్ఘాయుష్కు, చంద్రహారతి మానసిక ప్రశాంతతకు, కుంభహారతి సంపదలు, కోరికల నెరవేర్పునకు ప్రతీకలుగా భావిస్తారు. నక్షత్రహారతి జాతక దోషాల నివారణకు, కర్పూరహారతి పాపవిముక్తి, అష్టైశ్వర్య సిద్ధికి సంకేతంగా భక్తులు విశ్వసిస్తారు.

కార్తీక ఆదివారం.. భక్తులతో కిటకిటలాడిన క్షేత్రం..

కార్తీకమాస ఆదివారం కావడంతో ఆదివారం వేకువజాము నుంచే భక్తులు శ్రీశైలానికి పోటెత్తారు. తెల్లవారుజామున 3 గంటలకు ఆలయ ద్వారాలు తెరిచి ప్రాతఃకాల పూజల అనంతరం ఉదయం 4.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు దర్శనాలు కల్పించారు. ఆలయ శుద్ధి, ప్రదోషకాల పూజల అనంతరం సాయంత్రం 5.30 గంటల నుంచి తిరిగి దర్శనాలు ప్రారంభించారు.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని శని, ఆది, సోమవారాలతో పాటు పౌర్ణమి రోజుల్లో స్పర్శదర్శనాన్ని నిలిపివేసి అలంకార దర్శనానికి మాత్రమే అవకాశం కల్పిస్తున్నారు. క్యూలైన్లలో వేచివుండే భక్తులకు కట్టుపొంగలి, పులిహోర, పెరుగన్నం, బిస్కెట్లు, మంచినీరు నిరంతరం అందిస్తున్నారు. ఉదయం వేళ వేడిపాలు కూడా పంపిణీ చేశారు.

భక్తులకు విస్తృత సేవలు..

అన్నప్రసాద భవనంలో ఉదయం 10.30 గంటల నుంచి అన్నప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం 7 గంటల నుంచి అల్పాహారం అందించేందుకు ఏర్పాట్లు చేశారు. లడ్డూ ప్రసాదాల పంపిణీకి 12 కౌంటర్లు ఏర్పాటు చేయగా, మహిళలకు, వృద్ధులకు ప్రత్యేక కౌంటర్లు అందుబాటులో ఉంచారు. కార్తీక దీపారాధన కోసం ఆలయ ఉత్తర మాడవీధి, గంగాధర మండపం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రద్దీని సమర్థంగా నియంత్రిస్తూ భక్తులకు ఇబ్బందులు కలగకుండా దేవస్థానం అధికారులు, సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించారు.

నందీశ్వరుడికి విశేష అభిషేకం..

త్రయోదశిని పురస్కరించుకుని ఆదివారం ప్రదోషకాలంలో నందీశ్వరస్వామికి విశేషార్చన నిర్వహించారు. లోకక్షేమం, దేశ శాంతి, సకాలంలో వర్షాలు, పాడిపంటల సమృద్ధి, ప్రజల ఆయురారోగ్యాలను కాంక్షిస్తూ అర్చకులు, వేదపండితులు సంకల్పం పఠించారు. అనంతరం మహాగణపతి పూజ నిర్వహించి పంచామృతాలు, వివిధ పవిత్ర ద్రవ్యాలు, పుష్పోదకం, బిల్వోదకం, సువర్ణోదకం తదితరాలతో అభిషేకం చేశారు. వృషభసూక్తాది వేదమంత్రాల నడుమ అన్నాభిషేకం నిర్వహించి నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించి నానబెట్టిన శనగలను సమర్పించారు.

పల్లకీ సేవ.. నిత్యకళారాధన..

ఆదివారం రాత్రి లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ శ్రీ స్వామి అమ్మవార్లకు పల్లకీ ఉత్సవం నిర్వహించారు. ప్రతి ఆదివారం, పౌర్ణమి, మూలా నక్షత్రం రోజుల్లో దేవస్థానం సేవగా ఈ ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ.మరోవైపు దేవస్థానం ధర్మప్రథంలో భాగంగా నిత్యకళారాధన కార్యక్రమం భక్తులను అలరించింది. హైదరాబాద్‌కు చెందిన అక్షయ సోషల్ కల్చరల్ అసోసియేషన్ కళాకారులు వినాయక కౌత్వం, శివతాండవం, అయిగిరి నందిని, ఓం నమశ్శివాయ తదితర భక్తి గీతాలకు సంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. ప్రాచీన కళారూపాల పరిరక్షణతో పాటు స్వామి అమ్మవార్ల కైంకర్యాలు పరిపూర్ణంగా జరగాలనే సంకల్పంతో హరికథ, బుర్రకథ, నృత్య, సంగీత కార్యక్రమాలను దేవస్థానం నిర్వహిస్తోంది.

తల్లీబిడ్డల ఆరోగ్యమే లక్ష్యం..

సంగారెడ్డి, నవంబర్ 22: తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా సహజ ప్రసవాల ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సంగారెడ్డిలో ఆదివారం భారీ అవగాహన వాక్ నిర్వహించారు. సొసైటీ ఆఫ్ మిడ్‌వైవ్స్ ఇండియా ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఏకకాలంలో చేపట్టిన నేచురల్ బర్తింగ్ అవగాహన కార్యక్రమంలో భాగంగా ఈ వాక్ నిర్వహించారు.కార్యక్రమ సమన్వయకర్త, సంగారెడ్డి ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రొఫెసర్ విజయకుమారి ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం నుంచి ఐ.బి. చౌరస్తా వరకు వాక్ కొనసాగింది. యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు కూన వేణు, సంగారెడ్డిలోని జనని ఆసుపత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ కోమల్ జీత్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సహజ ప్రసవాల ప్రాముఖ్యతను ప్రతి మహిళకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. వైద్యపరమైన అవసరం లేకుండా సిజేరియన్ ప్రసవాలకు వెళ్లకుండా సరైన అవగాహన కల్పించాలని సూచించారు. గర్భధారణ సమయంలో సమతుల్య పోషకాహారం, తగిన శారీరక చురుకుదనం, మానసిక ధైర్యం, వైద్యుల సూచనలు పాటించడం తల్లి ఆరోగ్యానికి ఎంతో ముఖ్యమని వివరించారు. అయితే ప్రసవ విధానం తల్లి, బిడ్డల ఆరోగ్య పరిస్థితులను బట్టి వైద్యుల సలహా మేరకే నిర్ణయించుకోవాలని పేర్కొన్నారు.ప్రతి గర్భిణికి గర్భధారణ నుంచి ప్రసవం వరకు నాణ్యమైన వైద్య సలహాలు, ఆరోగ్య అవగాహన అందించాలని అన్నారు. సురక్షితమైన, గౌరవప్రదమైన ప్రసవ సంరక్షణ అందించడం వైద్య సిబ్బంది, కుటుంబ సభ్యులు, సమాజం అందరి బాధ్యత అని స్పష్టం చేశారు.

ప్రొఫెసర్ జయశంకర్ వర్సిటీలో

భారీగా నియామకాలు

- వ్యవసాయ వర్సిటీలో 566 అధ్యాపక పోస్టుల భర్తీకి ఆమోదం
- ఆర్థిక శాఖ నుంచి గ్రీన్ సిగ్నల్ జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం
- రాతపరీక్షతో పాటు ఇంటర్వ్యూలు తప్పనిసరని స్పష్టీకరణ
- త్వరలో రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ జారీకి వర్సిటీ సన్నాహాలు



తెలంగాణలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. వర్సిటీలో మొత్తం 566 బోధనా సిబ్బంది పోస్టులను భర్తీ చేసేందుకు ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వీటిలో 48 ప్రొఫెసర్, 148 అసోసియేట్ ప్రొఫెసర్, 370 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఉన్నాయి.రాష్ట్రంలో కొత్తగా వ్యవసాయ కళాశాలల ఏర్పాటు, నూతన కోర్సుల ప్రవేశం, అత్యాధునిక పరిశోధనా కేంద్రాల ప్రారంభం వంటి కారణాలతో వర్సిటీలో అధ్యాపకుల అవశ్యకత పెరిగింది. ఈ నేపథ్యంలో ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని కోరుతూ విశ్వవిద్యాలయం ఇటీవల ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. వీటిని పరిశీలించిన ప్రభుత్వం, ఖాళీల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.నియామక ప్రక్రియ పారదర్శకంగా సాగాలన్న ఉద్దేశంతో, కేవలం రాత పరీక్ష ఆధారంగానే ఈ పోస్టులను భర్తీ చేయాలని, ఇంటర్వ్యూలను మినహాయించాలని వర్సిటీ పాలకమండలి ప్రభుత్వాన్ని కోరింది. అయితే, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ), ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐకార్) నిబంధనల ప్రకారం ఇంటర్వ్యూలు నిర్వహించడం తప్పనిసరని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇంటర్వ్యూలు లేకుండా నియామకాలు చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని ముఖ్యమంత్రి కార్యాలయం, ఆర్థిక శాఖ తేల్చిచెప్పాయి. ఆర్థిక శాఖ నుంచి అనుమతి లభించడంతో, విశ్వవిద్యాలయం త్వరలోనే అధికారిక నోటిఫికేషన్‌ను విడుదల చేయనుంది.

డొనాల్డ్ ట్రంప్‌కు ఊరట..

- సెనేట్‌లో వీగిపోయిన వార్ పవర్స్ తీర్మానం
- ఇరాన్‌తో సైనిక చర్యలను నిలిపివేయాలన్న తీర్మానాన్ని తిరస్కరించిన యూఎస్ సెనేట్
- సెనేట్‌లో 48-51 ఓట్ల తేడాతో వీగిపోయిన కీలకమైన హెచ్.కాన్.రెస్ 93 తీర్మానం
- ఈ యుద్ధం వల్ల 47 బిలియన్ డాలర్ల ప్రజాధనం వృథా అయిందన్న డెమోక్రాట్లు
- హర్మూజ్ జలసంధి రక్షణకు ఈ పోరాటం అత్యంత కీలకమన్న రిపబ్లికన్లు
- వచ్చే జనవరిలో కొలువుదీరే కొత్త కాంగ్రెస్‌లో మళ్లీ పోరాడతామన్న విపక్ష నేతలు



ఇరాన్‌తో జరుగుతున్న సైనిక ఘర్షణల నుంచి అమెరికా బలగాలను ఉపసంహరించుకోవాలని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఆదేశిస్తూ రూపొందించిన 'వార్ పవర్స్' తీర్మానాన్ని యూఎస్ సెనేట్ తిరస్కరించింది. నవంబర్ 3న మధ్యంతర ఎన్నికలు ముగిసిన తర్వాత ఈ యుద్ధ అంశంపై సెనేట్‌లో జరిగిన మొదటి ఓటింగ్ ఇదే కావడం గమనార్హం. ప్రతినిధుల సభ ఇప్పటికే ఆమోదించిన హెచ్.కాన్.రెస్ 93 తీర్మానంపై నిర్వహించిన ఓటింగ్‌లో అనుకూలంగా 48, వ్యతిరేకంగా 51 ఓట్లు రావడంతో ఇది వీగిపోయింది. ఈ తీర్మానానికి ముగ్గురు రిపబ్లికన్ సెనేటర్లు సుసాన్ కాలిన్స్, లిసా మూర్కోవ్స్కీ, రాండ్ పాల్ డెమోక్రాట్లకు అనుకూలంగా ఓటు వేయగా, డెమోక్రటిక్ పార్టీకి చెందిన జాన్ ఫెటర్‌మ్యాన్ దీనికి వ్యతిరేకంగా ఓటు వేశారు. క్రిస్ మర్ఫీ ఓటింగ్‌కు హాజరుకాలేదు. 1973 నాటి వార్ పవర్స్ యాక్ట్ కింద ఈ యుద్ధాన్ని ముగించేందుకు సెనేట్ ఓటింగ్ నిర్వహించడం ఇది 15వ సారి.సెనేట్‌లో చర్చ సందర్భంగా డెమొక్రాట్ సెనేటర్ టామీ బాల్డ్‌విన్ మాట్లాడుతూ, ఈ యుద్ధం వల్ల ఇప్పటివరకు అమెరికా పన్ను చెల్లింపుదారుల సొమ్ము 47 బిలియన్ డాలర్లు ఖర్చయిందని, 23 మంది అమెరికన్లు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. అయితే, రిపబ్లికన్ సెనేటర్ టిమ్ షీహీ దీనిని వ్యతిరేకిస్తూ.. ఇది ఇష్టపూర్వకంగా చేస్తున్న యుద్ధం కాదని, దేశ భద్రత దృష్ట్యా అనివార్యమైన పోరాటమని స్పష్టం చేశారు. హర్మూజ్ జలసంధిపై ఇరాన్ పట్టు సాధిస్తే ప్రపంచ ఇంధన సరఫరాలో సగానికిపైగా దెబ్బతింటుందని హెచ్చరించారు.ఈ ఓటింగ్‌లో తీర్మానం వీగిపోయినప్పటికీ, జనవరిలో కొలువుదీరే కొత్త కాంగ్రెస్‌లో తాము తిరిగి ఈ సమస్యను లేవనెత్తుతామని డెమోక్రటిక్ నేతలు పేర్కొన్నారు. మరోవైపు, ఇరాన్‌లో దూకుడు సైనిక చర్యలకు నిధులను నిరోధించని ఏ బడ్జెట్ ప్యాకేజీనైనా వ్యతిరేకిస్తామని భారత సంతతి కాంగ్రెస్‌మన్ రో ఖన్నా, యాసమిన్ అన్సారీ స్పష్టం చేశారు. డిసెంబర్ 11తో ప్రస్తుత ఫెడరల్ నిధుల గడువు ముగియనుంది.

భారత్‌ను చూసి నేర్చుకోండి

- అమెరికా వడ్డీ రేట్లపై ట్రంప్ సంచలన వ్యాఖ్యలు..

అమెరికా: అమెరికా అధ్యక్షుడు తమ దేశ కేంద్ర బ్యాంకు అయిన ఫెడరల్ రిజర్వ్‌పై విమర్శలు గుప్పించారు. వడ్డీ రేట్లు ఎక్కువగా ఉండటంతో దేశ ఆర్థిక వృద్ధికి ఆటంకం కలుగుతోందని ఆరోపించారు. ఇదే సమయంలో భారత్‌ను ఉదాహరణగా చూపిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో తక్కువ వడ్డీ రేట్లు ఉన్నాయని, ఏడు శాతం ఆర్థిక వృద్ధి నమోదవుతోందని ప్రశంసించారు. అమెరికా కూడా ఇదే విధానాన్ని అనుసరిస్తే 15 నుంచి 20 శాతం వరకు జీడీపీ వృద్ధి సాధించవచ్చని వ్యాఖ్యానించారు వైట్‌హౌస్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడిన ట్రంప్, అమెరికా ఫెడరల్ రిజర్వ్ విధానాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆ సంస్థ రాజకీయ ప్రభావంతో పనిచేస్తోందని విమర్శించారు. ఆర్థిక గణాంకాలు మెరుగ్గా ఉన్న సమయంలో వడ్డీ రేట్లను తగ్గించాల్సింది పోయి పెంచడం ఏమిటని ప్రశ్నించారు. దేశ ఆర్థిక పరిస్థితి బలంగా ఉన్నప్పుడు అప్పులు తీసుకునేవారికి ఖర్చు తగ్గించాలని, కానీ అమెరికా కేంద్ర బ్యాంకు అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. దీనివల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు నష్టం జరుగుతోందని అన్నారు భారత్‌లో తక్కువ వడ్డీ రేట్లు ఉన్నప్పటికీ ఏడు శాతం స్థాయిలో జీడీపీ వృద్ధి నమోదవుతోందని ప్రశంసించారు . భారత్‌ను చూడాలని, అక్కడి ఆర్థిక వృద్ధిని గమనించాలని అమెరికా విధాన నిర్ణేతలకు సూచించారు. అమెరికా ప్రపంచంలోనే అత్యల్ప వడ్డీ రేట్లు కలిగిన దేశంగా ఉండాలని అన్నారు. ఇతర దేశాల ఆర్థిక వ్యవస్థలు విజయవంతం కావడానికి అమెరికా కీలక పాత్ర పోషిస్తోందని, అలాంటి అమెరికాకే అత్యల్ప వడ్డీ రేట్లు ఉండాలని ట్రంప్ వ్యాఖ్యానించారు. అమెరికాలో వడ్డీ రేట్లు తగ్గిస్తే 14 నుంచి 20 శాతం వరకు ఆర్థిక వృద్ధి సాధించవచ్చని ఆయన అన్నారు. ప్రస్తుతం అమెరికాలో సుమారు నాలుగు శాతం వృద్ధి నమోదవుతోంది.

మహారాష్ట్రలో మహాయుతి కూటమిలో విభేదాలు..

బీజేపీ కంచుకోటలో షిండే సేన పాగా వేయాలని వ్యూహం!

- విదర్భలో శివసేన విస్తరణకు ప్రయత్నాలు..

యువ కార్యకర్తలకు రాజకీయ అవకాశాలపై దృష్టి



నవంబర్ 22, 2026 ముంబై: మహారాష్ట్ర అధికార మహాయుతి కూటమిలో మరోసారి రాజకీయ పోటీ తెరపైకి వచ్చింది. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు బలమైన పట్టున్న విదర్భ ప్రాంతంలో తన పార్టీ ప్రాబల్యాన్ని పెంచుకునేందుకు ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. యువ కార్యకర్తలను ఆకర్షించి పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని ప్రణాళికలు రూపొందిస్తోంది. విదర్భలో బీజేపీకి బలమైన రాజకీయ పునాది ఉండటంతో అక్కడ శివసేన విస్తరణ ప్రయత్నాలు కూటమిలో చర్చకు దారితీస్తున్నాయి. యువతకు రాజకీయంగా ఎదిగే అవకాశాలు కల్పించడం ద్వారా కొత్త నాయకత్వాన్ని తయారు చేయాలని షిండే వర్గం భావిస్తోంది. ఇప్పటికే బీజేపీ ఆధిపత్యం ఉన్న ప్రాంతాల్లో మరో కూటమి భాగస్వామి విస్తరణకు ప్రయత్నించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ పరిణామాలు మహాయుతి పార్టీల మధ్య భవిష్యత్తులో సీట్ల పంపకం, రాజకీయ ఆధిపత్యంపై ప్రభావం చూపే అవకాశముంది.

చిన్నారులకు పోలియో చుక్కలు వేయించిన సురేష్ గౌడ్

- పోలియో రహిత సమాజ నిర్మాణానికి తల్లిదండ్రులు సహకరించాలి..

- ప్రతి చిన్నారికి రెండు చుక్కలు తప్పనిసరి



నవంబర్ 22, 2026 గోల్నాక: పోలియో చుక్కల కార్యక్రమాన్ని పురస్కరించుకుని గోల్నాక డివిజన్‌లోని శంకర్‌నగర్ ట్విన్ సిటీస్ స్కూల్‌తో పాటు బస్తీ దవాఖానాల్లో చిన్నారులకు గోల్నాక డివిజన్ సీనియర్ నాయకుడు సురేష్ గౌడ్ పోలియో చుక్కలు వేయించారు. ఈ సందర్భంగా ఆయన చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో పోలియో చుక్కల ప్రాధాన్యతను వివరించారు.
ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, ఏ ఒక్క చిన్నారిని కూడా ఈ కార్యక్రమానికి దూరం చేయవద్దని విజ్ఞప్తి చేశారు. ప్రతి చిన్నారి ఉజ్వల భవిష్యత్తు కోసం రెండు చుక్కల పోలియో మందు వేయించడం తల్లిదండ్రుల బాధ్యత అని పేర్కొన్నారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సురేష్ గౌడ్ పిలుపునిచ్చారు.

డ్రగ్స్‌కు బానిస కావద్దు.. కుటుంబానికి భారంగా మారవద్దు!

- యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి..

- పోక్సో, ఎన్‌డీపీఎస్ చట్టాలపై జడ్జి మూల స్వాతి గౌడ్ అవగాహన



నవంబర్ 22, 2026 జగదేవ్‌పూర్: సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో పోక్సో, ఎన్‌డీపీఎస్ చట్టాలపై ప్రత్యేక న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పోసాన్‌పల్లి రాజు అధ్యక్షతన జరిగిన ఈ



కార్యక్రమానికి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మూల స్వాతి గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. యువత మాదకద్రవ్యాలకు బానిసై విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని, కుటుంబ సభ్యులకు భారంగా మారవద్దని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వ్యక్తి ఆరోగ్యం, కుటుంబ జీవితం, సామాజిక గౌరవం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ విద్య, ఉపాధి, లక్ష్యసాధనపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. చట్టం ముందు అందరూ సమానమేనని, హక్కులతో పాటు బాధ్యతలను కూడా ప్రతి ఒక్కరూ గుర్తించాలని తెలిపారు. ప్రతి పౌరుడు చట్టాలపై అవగాహన కలిగి ఉండటంతో పాటు సమాజం పట్ల తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని పేర్కొన్నారు. పోక్సో చట్టం బాలల హక్కులు, భద్రతకు చట్టపరమైన రక్షణ కల్పిస్తుందని వివరించారు. బాలలపై లైంగిక నేరాల విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, పిల్లల రక్షణలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజలు సమిష్టి బాధ్యత తీసుకోవాలని సూచించారు. నేరాల నివారణకు న్యాయ అవగాహన కార్యక్రమాలు ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు వీరబత్తిని రామకృష్ణ, ఏ. కిరణ్ సాగర్ రావు, గజ్వేల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కందుకూరి కర్ణాకర్, జనరల్ సెక్రటరీ చెనరాజ్ పండరి, అశోక్, అనూష, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, ఉపసర్పంచ్ అక్కరాజు నాగరాజు, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, యువత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజానికి
ప్రతి ఒక్కరు కృషి చేయాలి
మాజీ కౌన్సిలర్ రామన్న గారి మణికంఠ గౌడ్



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని మాజీ కౌన్సిలర్ రామన్న గారి మణికంఠ గౌడ్ పిలుపునిచ్చారు. మేడ్చల్ పట్టణం బస్తీ దవఖాన లో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మణికంఠ గౌడ్ పాల్గొని ఐదు సంవత్సరాలలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసి మాట్లాడుతూ అర్హులైన చిన్నారుల కు పోలియో చుక్కలు వేయడం ప్రతి ఒక్క తల్లిదండ్రుల బాధ్యత అని పేర్కొన్నారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరి బాధ్యత అని, భావితరాల అభివృద్ధికి పోలియో చుక్కలు ఎంతో ఉపయోగపడతాయని, ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేసి ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని రామన్న గారి మణికంఠ గౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేత మోనార్క్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లంపేట మున్సిపల్ పరిధిలో
వాడవాడల్లో పోలియో చుక్కల పంపిణీ



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) ఎల్లంపేట మున్సిపల్ పరిధిలో ని వాడవాడలో పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ఎల్లంపేట మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీదేవి రమేష్ తో పాటు కమిషనర్ కృష్ణారెడ్డి పలువురు కౌన్సిలర్లు పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలి : చైర్ పర్సన్ శ్రీదేవి

ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలని ఎల్లంపేట మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీదేవి రమేష్ అన్నారు. ఎల్లంపేట మున్సిపల్ పరిధిలో ఏర్పాటుచేసిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఎల్లంపేట మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీదేవి రమేష్ ప్రారంభించి ఐదేళ్ల లోపు పిల్లలకు స్వయంగా పోలియో చుక్కలు వేసి మాట్లాడుతూ పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు బాధ్యతగా సహకరించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ ఎన్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో పల్స్ పోలియో కార్యక్రమం ఎంతో కీలకమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీలత రమేష్ మున్సిపల్ మేనేజర్ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ లో....

ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని నూతనకల్ గ్రామంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించి అర్హులైన చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు సద్ది సురేష్ రెడ్డి చిన్నోళ్ల భాస్కర్, వార్డు అధికారి రవీందర్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు యూనస్ పాషా పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలియో రహిత సమాజ నిర్మాణమే మన లక్ష్యం అని, ఐదు సంవత్సరాలలోపు చిన్నారులు అందరికీ పోలియో చుక్కలు వేయించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

చిన్నారుల ఆరోగ్యమే
కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం
పోలియో చుక్కల కార్యక్రమంలో పాల్గొన్న
మాజీ వైస్ చైర్మన్ చీర్ల రమేష్



మెదచ్చల్ (ప్రశ్న న్యూస్) మెదచ్చల్ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చీర్ల రమేష్ మెదచ్చల్ మున్సిపాలిటీ డివిజన్ పరిధిలోని కింది బస్తీ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పల్స్ పోలియో చుక్కల కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేయించి, తల్లిదండ్రులకు పోలియో వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం తల్లిదండ్రుల బాధ్యత అని, పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.ప్రజారోగ్యానికి, ముఖ్యంగా చిన్నారుల భవిష్యత్తుకు పెద్దపీట వేస్తూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక ఆరోగ్య, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని చీర్ల రమేష్ గారు కొనియాడారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజల ఆరోగ్యం, సంక్షేమం మరియు భవిష్యత్తు తరాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.“ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు -- ఆరోగ్యవంతమైన తెలంగాణ మనందరి బాధ్యత” అనే సందేశంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఒక్క పోలియో చుక్క జీవితాంతం రక్షణ
గుండ్ల పోచంపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు
గరిసెల సురేందర్ ముదిరాజ్



మేడ్చల్(ప్రశ్న న్యూస్)0 నుండి 5 ఏళ్ళ లోపు ప్రతి బిడ్డకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని గుండ్ల పోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గరిసెల సురేందర్ ముదిరాజ్ అన్నారు. గుండ్ల పోచంపల్లి మున్సిపల్ కార్యాలయం తో పాటు, గౌడవల్లి ఆరోగ్య ఉప కేంద్రం, కండ్ల కొయ్యలో అంగన్వాడి భవనంలో, మునీరాబాద్ అంగన్వాడి భవనంలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రంలో ప్రభుత్వ అధికారులు,మాజీ ప్రజా ప్రతినిధులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ,ఆశ వర్కర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలను గరిసెల సురేందర్ ముదిరాజ్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 సంవత్సరాల లోపు పిల్లలకు విధిగా పోలియో చుక్కలు వెయ్యాలని సూచించారు.

రాచగున్నేరిలో బి. జగన్నాథం నాయుడు విస్తృత ప్రచారం
మరోసారి ఆశీర్వదించాలని గ్రామస్తులకు విజ్ఞప్తి



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తి నియోజకవర్గం, శ్రీకాళహస్తి మండల పరిధిలోని రాచగున్నేరి గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బి. జగన్నాథం నాయుడు గ్రామంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ నెల 26వ తేదీన జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఇంటింటికీ వెళ్లి గ్రామస్తులను అభ్యర్థించారు.ఈ సందర్భంగా జగన్నాథం నాయుడు మాట్లాడుతూ.. గతంలో పలుమార్లు రాచగున్నేరి గ్రామ సర్పంచ్‌గా ఎన్నికై గ్రామాభివృద్ధికి కృషి చేసిన అనుభవం తనకు ఉందన్నారు. ప్రజలు మరోసారి అవకాశం కల్పించి ఆశీర్వదిస్తే గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతానని హామీ ఇచ్చారు.ప్రతిపక్ష నాయకుల ప్రచార తీరుపై స్పందిస్తూ.. తమకు ఓటు వేయకపోతే గ్రామస్తులపై విధ్వంసక చర్యలకు పాల్పడతామంటూ బెదిరింపు ధోరణిలో మాట్లాడటం సరైన పద్ధతి కాదని విమర్శించారు. గ్రామానికి ఎవరు అభివృద్ధి చేస్తారు? ప్రజల కష్టసుఖాల్లో ఎవరు అండగా ఉంటారు? సంక్షేమ పథకాలు,అవసరమైన సహాయక చర్యలు ఎవరు అందిస్తారు. అనే అంశాలను బేరీజు వేసుకుని ప్రజలు తమ అమూల్యమైన ఓటును.వినియోగించుకోవాలని కోరారు. ఈ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థులు ఘనవిజయం సాధిస్తారనే నమ్మకం తనకు ఉందని ధీమా వ్యక్తం చేశారు.ప్రచారానికి గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించింది. పలువురు గ్రామస్తులు కర్పూర హారతులతో జగన్నాథం నాయుడికి ఘనస్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటుకున్నారు. మరోసారి ఆయనే సర్పంచ్‌గా విజయం సాధిస్తారంటూ గ్రామస్తులు భరోసా వ్యక్తం చేశారు. ప్రజలు తనపై చూపిస్తున్న ఆదరణ, నమ్మకం ఎంతో సంతోషాన్ని కలిగిస్తున్నాయని జగన్నాథం నాయుడు పేర్కొన్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన వెంటనే గ్రామాభివృద్ధికి, ప్రజల అవసరాలకు అనుగుణంగా అన్ని రకాల సహాయక చర్యలు చేపట్టి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు.

నామినేషన్ల వివాదం.. జనసైనికుడి మృతి
- నాగులగుట్టపల్లి ఘటనపై పవన్ కళ్యాణ్ సీరియస్
- నిష్పక్షపాత విచారణకు కలెక్టర్, ఎస్పీకి ఆదేశాలు
- బాధ్యులెవరైనా వదిలేది లేదు.. రామాంజులు కుటుంబానికి అండగా ఉంటాం
- విచారణపై మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ప్రత్యేక బాధ్యతలు



అమరావతి/పులివెందుల (ప్రశ్న న్యూస్) పంచాయతీ ఎన్నికల నామినేషన్ల పరిశీలన వేళ చోటుచేసుకున్న వివాదం ఓ జనసైనికుడి ప్రాణాలను బలిగొన్న ఘటనపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తీవ్రంగా స్పందించారు. కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం, చక్రాయపేట మండలం సురభి గ్రామ పంచాయతీ పరిధిలోని నాగులగుట్టపల్లిలో జరిగిన పరిణామాలపై ఆరా తీశారు. జనసేన మద్దతుతో సర్పంచ్‌గా పోటీ చేస్తున్న అభ్యర్థి బంధువు, జనసేన కార్యకర్త ముంతల రామాంజులు నామినేషన్ల పరిశీలన సందర్భంగా చోటుచేసుకున్న వివాదం అనంతరం గుండెపోటుతో మృతి చెందడంపై విచారం వ్యక్తం చేశారు.

ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశం...

నామినేషన్ల పరిశీలన సమయంలో అసలేం జరిగింది? అక్కడ ఎలాంటి పరిస్థితులు నెలకొన్నాయి? వివాదానికి దారితీసిన కారణాలేమిటి? అనే అంశాలపై సమగ్ర వివరాలు సేకరించాలని కడప జిల్లా కలెక్టర్, ఎస్పీలకు పవన్ కళ్యాణ్ సూచించారు. విచారణలో ఎలాంటి పక్షపాతానికి తావులేకుండా నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. మృతుడు రామాంజులు కుటుంబ సభ్యుల వాంగ్మూలాలను నమోదు చేయడంతో పాటు ఘటనకు సంబంధించిన అన్ని కోణాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు.

బాధ్యులపై కఠిన చర్యలు తప్పవు

విచారణలో ఎవరైనా బాధ్యులుగా తేలితే చట్ట నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. రాజకీయ విభేదాలు, ఎన్నికల పోటీలు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారకూడదని, వాస్తవాలు వెలుగులోకి రావాల్సిన అవసరం ఉందని పార్టీ వర్గాలకు దిశానిర్దేశం చేశారు.

నాదెండ్ల మనోహర్‌కు ప్రత్యేక బాధ్యతలు..

ఈ ఘటనపై పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) చైర్మన్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు పవన్ కళ్యాణ్ ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. పులివెందులలో చోటుచేసుకున్న పరిణామాలు, క్షేత్రస్థాయి పరిస్థితులపై వివరాలు తెలుసుకోవాలని, విచారణ ప్రక్రియను సమన్వయం చేస్తూ పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు
వ్యక్తిగత భద్రతపై అవగాహన



హైదరాబాదు (ప్రశ్న న్యూస్) మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చిన్నతనం నుంచే వ్యక్తిగత భద్రతపై అవగాహన కల్పించేందుకు ప్రేరణ ఫౌండేషన్, సహృదయ ఫౌండేషన్ సంయుక్తంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించాయి. ‘బటర్‌ఫ్లై బ్లూమ్స్’ పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా కాప్రా మండలం కమలానగర్‌లోని ఎంపీ యూపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకు చదువుతున్న చిన్నారులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తత, వ్యక్తిగత భద్రత వంటి అంశాలను వివరించారు. పిల్లలు తమను తాము ఎలా కాపాడుకోవాలి, ఏదైనా అసౌకర్యకరమైన పరిస్థితి ఎదురైనప్పుడు ఎలా స్పందించాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా షేక్ ఫామిన్ వ్యవహరించారు. పాఠశాలలోని సుమారు 120 మంది విద్యార్థులకు వయసుకు తగిన రీతిలో విషయాలను అర్థమయ్యేలా వివరించారు. చిన్నారులకు కేవలం ఉపన్యాసాల రూపంలో కాకుండా కథలు, నాటికల ద్వారా వ్యక్తిగత భద్రతకు సంబంధించిన అంశాలను పరిచయం చేశారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ మధ్య తేడాను గుర్తించడం, తమకు నచ్చని లేదా అసౌకర్యాన్ని కలిగించే స్పర్శ ఎదురైతే దానిని నిర్లక్ష్యం చేయకుండా స్పందించడం వంటి విషయాలను తెలియజేశారు. పిల్లలు తమ శరీరంపై తమకు హక్కు ఉందనే అవగాహన కలిగి ఉండటం ఎంత ముఖ్యమో వివరించారు. అపరిచిత వ్యక్తుల పట్ల ఎలా అప్రమత్తంగా ఉండాలి, ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే ఏం చేయాలి, ప్రమాదకర పరిస్థితుల్లో ఎవరిని సంప్రదించాలి వంటి అంశాలపై కూడా విద్యార్థులకు సూచనలు ఇచ్చారు. తమకు ఎదురయ్యే అసౌకర్యకరమైన అనుభవాలను భయంతో దాచిపెట్టకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా నమ్మకమైన పెద్దలకు తెలియజేయాలని చెప్పారు. ఎవరైనా బెదిరించినా, రహస్యంగా ఉంచాలని ఒత్తిడి చేసినా భయపడకుండా సహాయం కోరాలని వివరించారు. తప్పు చేసిన వ్యక్తి పరిచయస్తుడైనా, అపరిచితుడైనా పిల్లలు తమ భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అవగాహన కల్పించారు. ఈ విషయాలను కథలు, నాటికల రూపంలో చెప్పడంతో విద్యార్థులు ఆసక్తిగా కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రేరణ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శరత్ సుదర్శి మాట్లాడుతూ, పిల్లల్లో వ్యక్తిగత భద్రతపై అవగాహనను బాల్యం నుంచే పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ లక్ష్యంతోనే ‘బటర్‌ఫ్లై బ్లూమ్స్’ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులకు తమ భద్రత గురించి తెలియజేయడంతో పాటు వారిలో ఆత్మవిశ్వాసం, ధైర్యం పెంపొందించడం కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని వివరించారు. పిల్లలు తమకు ఎదురయ్యే సమస్యలను గుర్తించి, అవసరమైన సమయంలో సరైన నిర్ణయం తీసుకునేలా తయారు చేయడం ముఖ్యమని అన్నారు.
ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఇలాంటి అవగాహన కార్యక్రమాలు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా వారి భద్రతకు సంబంధించిన అంశాలను మరింత చేరువ చేయవచ్చని నిర్వాహకులు భావిస్తున్నారు. పాఠ్యాంశాలతో పాటు జీవితానికి అవసరమైన సామాజిక అవగాహన, వ్యక్తిగత జాగ్రత్తలు కూడా పిల్లలకు తెలియజేయడం అవసరం. ముఖ్యంగా చిన్నారులు తమకు ఎదురయ్యే అసౌకర్యకరమైన పరిస్థితులను గుర్తించగలగడం, వాటిని నమ్మకమైన పెద్దలకు చెప్పగలగడం ఎంతో ముఖ్యం. ఈ దిశగా ‘బటర్‌ఫ్లై బ్లూమ్స్’ కార్యక్రమం ద్వారా పాఠశాల స్థాయిలో అవగాహన కల్పించేందుకు ఫౌండేషన్లు ప్రయత్నిస్తున్నాయి.ఈ కార్యక్రమానికి అమెరికాకు చెందిన సహృదయ ఫౌండేషన్ (యు ఎస్ ఏ) సహకారం అందిస్తోంది. ఆ సంస్థ వ్యవస్థాపకురాలు బిందు తాడివాకకు ప్రేరణ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శరత్ సుదర్శి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రెండు సంస్థల సమన్వయంతో మరిన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఈ కార్యక్రమాన్ని విస్తరించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. చిన్నారులకు అవసరమైన అవగాహనను అందించడంలో సహకరిస్తున్న వారందరికీ ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.కమలానగర్ పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని పాఠశాల పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు వ్యక్తులు కూడా ఆసక్తిగా వీక్షించారు. విద్యార్థులకు వ్యక్తిగత భద్రతపై అవగాహన కల్పిస్తున్న తీరును అభినందించారు. ఈ కార్యక్రమంలో అమీనా కళాందర్, రమ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజని, జయశ్రీ, మమత, రమేష్, అనురాధ, లక్ష్మీ ప్రసన్న, శైలజ తదితరులు పాల్గొన్నారు. నిర్వాహకులు, ఉపాధ్యాయులు, ఇతరులతో కలిపి సుమారు 125 మంది ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలనే ప్రణాళికతో ‘బటర్‌ఫ్లై బ్లూమ్స్’ తదుపరి కార్యక్రమాలపై ఆసక్తి నెలకొంది.

గ్రామీణ అభివృద్ధికి పెద్దపీట వేయాలి
- పార్వతీపురం మన్యం జిల్లా ప్రగతికి సమర్థవంతంగా పనిచేయాలి
- జెడ్పీ చైర్‌పర్సన్ నిమ్మల నీలిమకు మంత్రి అచ్చెన్నాయుడు దిశానిర్దేశం
- నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వక భేటీ



కోటబొమ్మాళి(ప్రశ్న న్యూస్) పార్వతీపురం మన్యం జిల్లా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన నిమ్మల నీలిమ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. ఆదివారం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో నిమ్మల నీలిమ మంత్రి అచ్చెన్నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన ఆమెకు మంత్రి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం కావాలి..

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు. గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ అభివృద్ధి ఫలాలు సమర్థవంతంగా అందేలా చొరవ తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధిలో జిల్లా పరిషత్ కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

ఎంపీటీసీ సభ్యులతో కలిసి భేటీ..

ఈ మర్యాదపూర్వక సమావేశంలో నిమ్మల నీలిమతో పాటు ఎంపీటీసీ సభ్యులు ఎం. లలిత, సంతోష్, బిడ్డిక సంధ్యారాణి, తోట ముఖలింగం, తోట గౌతమి తదితరులు పాల్గొన్నారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి సమన్వయంతో కృషి చేయాలన్న సందేశంతో ఈ భేటీ సాగింది.



మహేష్ బాబు సినిమాలో విలన్‌గా


నటించడానికైనా రెడీ

అనుపమ పరమేశ్వరన్ కామెంట్స్ వైరల్!

మలయాళ చిత్రం 'ప్రేమమ్'తో హీరోయిన్‌గా పరిచయమైన అనుపమ పరమేశ్వరన్.. ఆ తర్వాత తెలుగు సినిమాల్లోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. సహజమైన నటన, అందమైన చిరునవ్వు, చలాకీ తనంతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన ఈ కేరళ కుట్టి ప్రస్తుతం విభిన్నమైన కథలు, పాత్రలతో తన కెరీర్‌ను కొనసాగిస్తున్నారు. తాజాగా టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు గురించి అనుపమ చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మహేష్ బాబు సినిమాలో హీరోయిన్‌గా మాత్రమే కాకుండా విలన్‌గా నటించే అవకాశం వచ్చినా తాను సిద్ధమేనని ఆమె చెప్పడం అభిమానులను ఆకట్టుకుంటోంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అనుపమ పరమేశ్వరన్‌ను పలువురు హీరోల గురించి ప్రశ్నలు అడిగారు. ఈ క్రమంలో మహేష్ బాబును ఒక్క మాటలో వర్ణించమని యాంకర్ అడగగా.. ఆయన చాలా హ్యాండ్సమ్ అని ఏమాత్రం ఆలోచించకుండా సమాధానమిచ్చారు. మహేష్ బాబు అంటే తనకు ఎంతో ఇష్టమని, ఆయన అందం తనను ఎంతగానో ఆకట్టుకుంటుందని అనుపమ చెప్పుకొచ్చారు. అంతేకాకుండా భవిష్యత్తులో మహేష్ బాబు సినిమాలో నటించే అవకాశం వస్తే పాత్ర విషయంలో ఎలాంటి పరిమితులు పెట్టుకోనని వెల్లడించారు. హీరోయిన్‌గా అవకాశం వచ్చినా, విలన్‌గా నటించే ఛాన్స్ వచ్చినా వెంటనే అంగీకరిస్తానని తన మనసులోని మాటను బయటపెట్టారు. దీంతో మహేష్ అభిమానులు, అనుపమ అభిమానులు ఈ వ్యాఖ్యలపై ఆసక్తికరంగా స్పందిస్తున్నారు. మహేష్ బాబుకు విలన్‌గా నటిస్తే ఎదురయ్యే సరదా ఇబ్బందిని కూడా అనుపమ వివరించారు. సినిమాలో సన్నివేశం ప్రకారం మహేష్ బాబును కోపంగా, కసిగా చూడాల్సి ఉంటుందని.. కానీ ఆయన అందం ముందు అలా నటించడం తనకు కష్టమవుతుందేమోనని నవ్వుతూ చెప్పారు. మహేష్ బాబు సినిమాలో విలన్‌గా నటించే అవకాశం వస్తే, ఆయన వైపు కోపంగా చూడాల్సిన సన్నివేశాల్లో కూడా రొమాంటిక్‌గా చూస్తూ ఉండిపోతానేమో. ఆయన ఎదురుగా నిలబడితే డైలాగులు కూడా మర్చిపోతానేమో" అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. ఆమె చెప్పిన ఈ మాటలు అభిమానులకు నవ్వులు పూయించడంతో పాటు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి.

రష్మిక మందన్న 'మైసా' రిలీజ్ వాయిదా..

నవంబర్ 27న రావడం లేదని మేకర్స్ ప్రకటన!



నేషనల్ క్రష్ రష్మిక మందన్న ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'మైసా' విడుదల వాయిదా పడింది. ఈ చిత్రాన్ని తొలుత నవంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయాలని చిత్రబృందం నిర్ణయించింది. అయితే, తాజాగా ఈ విడుదల తేదీని వాయిదా వేస్తున్నట్లు మేకర్స్ సోషల్ మీడియా వేదికగా అధికారికంగా ప్రకటించారు.'మైసా' ప్రపంచాన్ని ఎటువంటి రాజీ లేకుండా అత్యుత్తమ నాణ్యతతో, సినిమాకు తగిన గొప్ప అనుభూతిని ప్రేక్షకులకు అందించాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఈ దార్శనికతతో నవంబర్ 27న జరగాల్సిన థియేట్రికల్ రిలీజ్‌ను వాయిదా వేస్తున్నామని, కొత్త విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తామని స్పష్టం చేసింది. కొత్త రిలీజ్ డేట్ వచ్చేలోపు అభిమానులు ఆ ఉత్సాహాన్ని అలాగే కొనసాగిస్తూ, చిత్రంలోని జోష్ నింపే 'ఓసే రాములమ్మ' పాటను ఆస్వాదించాలని మేకర్స్ కోరారు. రవీంద్ర పుల్లే దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌ను అన్‌ఫార్ములా ఫిల్మ్స్, టీ-సిరీస్ సౌత్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. వాయిదా వార్తతో అభిమానులు కొంత నిరాశకు గురైనప్పటికీ, నాణ్యత విషయంలో రాజీ పడకుండా సినిమాను తీసుకువస్తున్నారన్న అంశం పట్ల ఆసక్తి వ్యక్తం చేస్తున్నారు.

ఓటీటీలోకి అజయ్ దేవగన్ 'దృశ్యం

ది కన్‌క్లూజన్'.. స్ట్రీమింగ్ తేదీ అధికారిక ప్రకటన!

బాలీవుడ్ స్టార్ హీరో అజయ్ దేవగన్ నటించిన సూపర్ హిట్ క్రైమ్ థ్రిల్లర్ ఫ్రాంచైజీ 'దృశ్యం'కు ముగింపు పలుకుతూ వచ్చిన మూడో భాగం 'దృశ్యం: ది కన్‌క్లూజన్' బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. థియేటర్లలో ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేసిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. థియేటర్లలో ఈ సినిమాను మిస్ అయిన ప్రేక్షకులకు తాజాగా గుడ్ న్యూస్ అందింది. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా స్ట్రీమింగ్ తేదీని అధికారికంగా ప్రకటించింది. అభిషేక్ పాఠక్ దర్శకత్వంలో తెరకెక్కిన 'దృశ్యం: ది కన్‌క్లూజన్' ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ.600 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు సమాచారం. భారత్‌తో పాటు ఓవర్సీస్ మార్కెట్లలోనూ ఈ సినిమాకు అద్భుతమైన స్పందన లభించింది. అజయ్ దేవగన్ కెరీర్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా ఈ మూవీ నిలవడం విశేషం.మొదటి రెండు భాగాలు ప్రేక్షకుల్లో భారీ క్రేజ్ సంపాదించుకోవడంతో మూడో భాగంపై కూడా మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆ అంచనాలను అందుకుంటూ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి



విజయాన్ని సాధించింది. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్, క్రైమ్ థ్రిల్లర్ సినిమాలను ఇష్టపడే ప్రేక్షకులు ఈ చిత్రానికి బాగా కనెక్ట్ అయ్యారు. 'దృశ్యం' మొదటి రెండు హిందీ భాగాలు మలయాళ చిత్రాల ఆధారంగా తెరకెక్కిన సంగతి తెలిసిందే. అయితే మూడో భాగం విషయంలో దర్శకుడు అభిషేక్ పాఠక్ భిన్నమైన విధానాన్ని అనుసరించారు. మలయాళ వెర్షన్ కథను అనుసరించకుండా సరికొత్త కథనం, కొత్త మలుపులతో ఈ సినిమాను రూపొందించారు.కథలోని ట్విస్టులు, కుటుంబాన్ని కాపాడుకునేందుకు విజయ్ సాల్గాంకర్ చేసే ప్రయత్నాలు, పోలీసుల విచారణ, చివరి వరకు కొనసాగిన సస్పెన్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. రెండో భాగానికి ఏమాత్రం తగ్గకుండా ఈ మూడో భాగం ఉందంటూ పలువురు సినీ విమర్శకులు ప్రశంసలు కురిపించారు. థియేటర్లలో విజయవంతమైన ఈ సినిమా ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ తన 'కమింగ్ సూన్' విభాగంలో 'దృశ్యం: ది కన్‌క్లూజన్' నవంబర్ 27 నుంచి స్ట్రీమింగ్ కానున్నట్లు అధికారికంగా ప్రకటించింది.దీంతో సినిమా కోసం ఎదురుచూస్తున్న ఓటీటీ ప్రేక్షకులు తమ ఇంట్లోనే ఈ క్రైమ్ థ్రిల్లర్‌ను వీక్షించవచ్చు. థియేటర్లలో భారీ విజయాన్ని అందుకున్న ఈ చిత్రం ఓటీటీలోనూ మంచి ఆదరణ పొందే అవకాశం ఉంది. ఈ సినిమాలో అజయ్ దేవగన్ ప్రధాన పాత్రలో నటించగా, టబు, శ్రియా శరణ్, రజత్ కపూర్, జైదీప్ అహ్లావత్, ప్రకాష్ రాజ్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. పనోరమా స్టూడియోస్, స్టార్ స్టూడియోస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించాయి.

రిలీజ్ వాయిదా రూమర్లకు చెక్..

వృశకర్మ ట్రైలర్ వచ్చేది ఎప్పుడంటే?



అక్కినేని నాగచైతన్య హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'వృశకర్మ' పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. మైథలాజికల్ అడ్వెంచర్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా నుంచి ఎప్పటికప్పుడు వస్తున్న అప్‌డేట్స్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. అయితే ఇటీవల సినిమా విడుదల వాయిదా పడుతుందంటూ కొన్ని వార్తలు ప్రచారంలోకి రావడంతో అభిమానుల్లో కొంత ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం తాజాగా కీలక అప్‌డేట్ ప్రకటించి రిలీజ్‌పై స్పష్టత ఇచ్చింది. 'వృశకర్మ' సినిమాకు సంబంధించిన ట్రైలర్‌ను నవంబర్ 25, 2026న విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా సరికొత్త పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. ట్రైలర్ విడుదల తేదీని ప్రకటించడంతో పాటు, సినిమా డిసెంబర్ 4, 2026న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు మరోసారి స్పష్టం చేశారు. విడుదల తేదీపై వస్తున్న వాయిదా వార్తల మధ్య ఈ ప్రకటన నాగచైతన్య అభిమానులకు మంచి ఊరటనిచ్చింది. ట్రైలర్ విడుదలకు ఇంకా కొద్ది రోజులే సమయం ఉండటంతో సినిమా ప్రమోషన్స్ మరింత వేగవంతం కానున్నాయి. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, పాటలు సినిమాపై ఆసక్తిని పెంచుతుండగా.. ట్రైలర్‌తో అసలు కథ, నాగచైతన్య పాత్ర స్వరూపం గురించి మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉంది. ఈ సినిమాలో నాగచైతన్యకు జోడీగా మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్నారు. బాలీవుడ్ నటుడు స్పర్శ్ శ్రీవాస్తవ ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. విభిన్నమైన కథాంశంతో, మైథలాజికల్ నేపథ్యాన్ని ఆధునిక కథనంతో మిళితం చేస్తూ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది.ఇప్పటికే ఈ సినిమా నుంచి రెండు పాటలను విడుదల చేశారు. వాటికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన రావడంతో ఇప్పుడు ట్రైలర్‌పై అంచనాలు మరింత పెరిగాయి. ముఖ్యంగా నాగచైతన్య ఈ సినిమాలో సరికొత్త లుక్, విభిన్నమైన పాత్రలో కనిపించనున్నారనే ప్రచారం అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. 'వృశకర్మ' సినిమాకు అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు. ఆయన సంగీతం, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఈ తరహా అడ్వెంచర్ థ్రిల్లర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని అభిమానులు భావిస్తున్నారు. బీవీఎస్ఎన్ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నాగచైతన్య కెరీర్‌లో మరో విభిన్నమైన ప్రయత్నంగా తెరకెక్కుతున్న ఈ సినిమా డిసెంబర్ 4న థియేటర్లలో విడుదల కానుంది. నవంబర్ 25న విడుదలయ్యే ట్రైలర్ సినిమాపై అంచనాలను మరింత పెంచుతుందా? బాక్సాఫీస్ వద్ద నాగచైతన్య ఎలాంటి విజయాన్ని అందుకుంటారో చూడాలి.

గోపాలకృష్ణుడు నందబాలుడు



గ్రామీణ తెలంగాణ నేపథ్య కథాంశంతో రూపొందిస్తున్న చిత్రం 'ఇడుపు కాయితం'. ప్రియదర్శి, నాగదుర్గ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని బన్నీ వాస్, తబిత సుకుమార్ నిర్మిస్తున్నారు. వంశీ రెడ్డి దొండపాటి దర్శకుడు. డిసెంబర్ 11న ప్రేక్షకుల ముందుకురానుంది. శనివారం ఈ సినిమా నుంచి 'గోగులు గోగులు' అనే పాటను విడుదల చేశారు. సురేష్ బొబ్బిలి స్వరపరచిన ఈ పాటకు కొంగరి కృష్ణ సాహిత్యాన్ని అందించారు. అభిక్య తనికెళ్ల, రచిత రాయప్రోలు, జయశ్రీ పల్లెం, స్నిగ్ధ శర్మ ఆలపించారు. 'గోగులు గోగులు గోపాలకృష్ణుడు సేలి.. గోపాలకృష్ణుడు ఆనంద బాలుడు.. నందకుమారుడు రమ్మనరే రమ్మనరే నలుగుకు నా ముద్దు గోపాలకృష్ణున్ని' అంటూ నాయకానాయికల వివాహ వేడుక నేపథ్యంలో ఈ పాటను చిత్రీకరించారు. పెళ్లి తాలూకు సంబరాన్ని అందంగా ఆవిష్కరిస్తూ కలర్‌ఫుల్ విజువల్స్‌తో ఈ పాట సాగింది. ఈ చిత్రానికి సంగీతం: సురేష్ బొబ్బిలి, రచన-దర్శకత్వం: వంశీరెడ్డి దొండపాటి.

మా హామీ నువ్వే.. శివగామీ నువ్వే

సంక్రాంతి పండుగ అంటేనే బంధువుల సందడి, ఆప్యాయతలు, ఆటపాటలకు వేదిక. అలాంటి పండుగ వాతావరణాన్ని అందంగా ఆవిష్కరిస్తూ 'జనవరి 12 విడుదల' చిత్రం నుంచి 'డివికి డివికి' అనే పాటను విడుదల చేశారు. వెంకటేష్, కల్యాణ్‌రామ్, కీర్తి సురేష్, కృతిశెట్టి ప్రధాన పాత్రల్లో అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జనవరి 12న ప్రేక్షకుల ముందుకురానుంది. జీవీ ప్రకాష్‌కుమార్ స్వరపరచిన ఈ పాటను అనంత శ్రీరామ్ రచించారు. మధుప్రియ, హరిప్రియ ఆలపించారు. 'వదినా వయ్యారి, వదినా బంగారి, వదినా ఎవరైనా నీకన్నానా.. వదినా పువ్వంటి, వదినా నిప్పంటి, వదినా నీకే తందానానా.. మా హామీ నువ్వే, శివగామీ నువ్వే' అంటూ ఉత్సాహభరితమైన బీట్స్‌తో ఈ పాట సాగింది. కథానాయికలు కీర్తి సురేష్, కృతిశెట్టి సంప్రదాయ దుస్తుల్లో మెరిసిపోతూ హుషారెత్తించే డ్యాన్స్ మూమెంట్స్‌తో ఆకట్టుకున్నారు. వదినా, మరదళ్ల మధ్య ఉండే అనుబంధం, ఆప్యాయతల్ని ఆవిష్కరిస్తూ ఈ పాట ఆకట్టుకుంది. ఈ చిత్రానికి సాహు గారపాటి నిర్మాత.



నీట్ లో సత్తా చాటిన ఎస్ ఆర్ విద్యార్థులకు సన్మానం

- సన్మానించిన డిజిఎం భగవాన్ రెడ్డి, కోర్ డీన్ కె. శ్రీనివాస్



మేడ్చల్(ప్రశ్న న్యూస్)ఎస్ఆర్ విద్యాసంస్థల నాణ్యమైన కోచింగ్‌తో పాటు సీనియర్ అధ్యాపకుల వివరణాత్మక బోధనతోనే నీట్ లో ఉత్తమ ఫలితాలు సాధ్యమయ్యాయని ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వరదా రెడ్డి సంతోషాన్ని వ్యక్తం చేశారు.ఈ సంవత్సరం ఎస్ ఆర్ కళాశాల నుంచి 705 మార్కులతో వీరయ్య గారి సహయ జాతీయ స్థాయిలో 9 వ ర్యాంకు, సౌత్ ఇండియాలో మొదటి ర్యాంకు సాధించినందుకు ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వరద రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.హైదరాబాద్, మాదాపూర్ ఎస్ఆర్ క్యాంపస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 2024-26 విద్యాసంవత్సరంలో హైదరాబాద్ ఎస్ఆర్ కళాశాల విభాగంలో రెగ్యులర్ ఇంటర్‌తో పాటుగా నీట్ కోచింగ్ తీసుకున్న విద్యార్థుల్లో 72 మంది ఎంబీబీఎస్ సీట్లు సాధించారని తెలిపారు . వీరిని ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఎనగందుల వరదారెడ్డి, డైరెక్టర్స్ మధుకర్ రెడ్డి, సంతోష్ రెడ్డి, సిఈఓ సురేందర్ రెడ్డి, నీట్ కోఆర్డినేటర్ సుధాకర్, డీజీఎంలు భగవాన్ రెడ్డి, వాసుదేవరెడ్డి, అకడమిక్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ అభినందించారు. అనంతరం భగవాన్ రెడ్డి మాట్లాడుతూ నీట్ లో ఉన్నతమైన కోచింగ్‌తో పాటు సీనియర్ అధ్యాపకుల బోధన, వారాంతపు పరీక్షలు, స్టడీ అవర్స్, విద్యార్థులకు సందేహాల నివృత్తి చేయడంతో ఉత్తమ ఫలితాలు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్స్, డీన్స్, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలి

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



మేడ్చల్(ప్రశ్న న్యూస్) పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఉప్పల్ నియోజకవర్గ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించడం తల్లిదండ్రుల బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కె. ఆనంద్ తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐదేళ్లలోపు చిన్నారులకు ఓరల్ పోలియో వ్యాక్సిన్ రెండు చుక్కలు వేసి పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు.అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కె. ఆనంద్ సంబంధిత అధికారులతో కలిసి ఉప్పల్ బస్‌స్టాప్, హెచ్ ఎం ఆర్ ఎల్ ఉప్పల్ మెట్రో స్టేషన్, ఇతర రద్దీ ప్రదేశాలు పల్స్ పోలియో సెషన్ కేంద్రాలను సందర్శించి కార్యక్రమం అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా పోలియో వ్యాక్సిన్‌ను నిర్దేశిత ప్రమాణాల ప్రకారం సక్రమంగా నిల్వ చేస్తున్నారా లేదా అనే అంశాన్ని పరిశీలించడంతో పాటు, వ్యాక్సిన్ తీసుకున్న ప్రతి చిన్నారి ఎడమ చేతి చిటికెన వేలికి గుర్తు (మార్కింగ్) సక్రమంగా వేస్తున్నారా లేదా పరిశీలించారు. అలాగే చిన్నారులకు వ్యాక్సిన్ అందించిన వివరాలను ట్యాలీ షీట్లలో సక్రమంగా నమోదు చేస్తున్నారా అని తనిఖీ చేశారు. పల్స్ పోలియో సెషన్ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న ఏర్పాట్లు, సిబ్బంది పనితీరు, కార్యక్రమ నిర్వహణ తీరును కూడా డా. కె. ఆనంద్ సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీకా అధికారి డా కౌశిక్ జిల్లా అధికారి డా గీత ప్రసాద్ ఉప్పల్ వైద్యాధికారి శౌశీల్య , ఉప్పల్ సిబ్బంది పాల్గొన్నారు

5 ఏళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించడం ప్రతి ఒక్కరి బాధ్యత

- ఎల్లంపేట మున్సిపల్ వైస్ చైర్మన్ రజిత దేవేందర్ రెడ్డి



మేడ్చల్(ప్రశ్న న్యూస్) ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని బండ మాదారం లో ని 19వ వార్డులో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్లంపేట మున్సిపల్ వైస్ చైర్మన్ రజిత దేవేందర్ రెడ్డి పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రజిత దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ 5 సంవత్సరాల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించి, పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి వారి భవిష్యత్తుకు పునాది వేయాల్సిన బాధ్యత ప్రతి ఒకరి తల్లిదండ్రులపై ఉందని తెలిపారు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేసి ఆరోగ్యవంతమైన జీవితాన్ని కల్పించాలని వైస్ చైర్మన్ రజిత దేవేందర్ రెడ్డి సూచించారు.

బట్టతలకు చెక్ పెట్టే చైనా కరెంట్ దువ్వెన

- విద్యుత్ సాంకేతికతతో జుట్టు తిరిగి మొలిపించే ప్రయోగం.. ఎలుకలపై సత్ఫలితాలు

- 28 రోజుల్లోనే 97.85 శాతం జుట్టు పెరుగుదల.. మనుషులపై పరీక్షలు ఎప్పుడు.?





మేడ్చల్ (ప్రశ్న న్యూస్) బట్టతల.. జుట్టు రాలిపోవడం.. చిన్న వయసులోనే నుదురు భాగం నుంచి వెంట్రుకలు తగ్గిపోవడం.. ఇవి నేటి సమాజంలో చాలామందిని వేధిస్తున్న సమస్యలు. జుట్టు అందాన్ని మాత్రమే కాదు, వ్యక్తిగత ఆత్మవిశ్వాసాన్ని కూడా ప్రభావితం చేస్తోంది. జుట్టు రాలకుండా ఉండేందుకు ఎన్నో రకాల నూనెలు, షాంపూలు, మందులు, చికిత్సలు అందుబాటులో ఉన్నప్పటికీ అందరికీ ఆశించిన ఫలితాలు రావడం లేదు. ఈ నేపథ్యంలో చైనా శాస్త్రవేత్తలు రూపొందించిన ప్రత్యేక విద్యుత్ దువ్వెన ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది.

సాధారణ దువ్వెన కాదు.. సరికొత్త సాంకేతికత

చైనా పరిశోధకులు రూపొందించిన ఈ ప్రత్యేక పరికరానికి 'డిట్యాంగిల్ ' అని పేరు పెట్టారు. ఇది చూడటానికి సాధారణ దువ్వెన మాదిరిగానే ఉన్నప్పటికీ ఇందులో సూక్ష్మ ఎలక్ట్రానిక్ వ్యవస్థ, ప్రత్యేక ఎలక్ట్రోడ్లు అమర్చారు. జుట్టు దువ్వుతున్న సమయంలో ఈ పరికరం తక్కువ వ్యవధిలో పల్స్ రూపంలో విద్యుత్ క్షేత్రాన్ని ఉత్పత్తి చేస్తుంది.ఈ విద్యుత్ క్షేత్రం ద్వారా జుట్టు కుదుళ్ల వరకు ఔషధ పదార్థాలు చేరేలా చేయడం ఈ సాంకేతికత ప్రత్యేకత. జుట్టు పెరుగుదలకు సంబంధించిన ప్రయోగాత్మక జన్యు చికిత్స పదార్థాలను చర్మం లోపలి భాగాలకు చేరవేయడంలో ఇది సహాయపడుతుందని పరిశోధకులు చెబుతున్నారు.

28 రోజుల్లోనే ఆశ్చర్యకరమైన ఫలితాలు

ఈ పరికరంపై నిర్వహించిన పరిశోధనల్లో బట్టతల లక్షణాలను పోలిన పరిస్థితిని ఎలుకల్లో సృష్టించి పరీక్షలు చేశారు. కేవలం దువ్వెనతో విద్యుత్ ప్రేరణ ఇవ్వడం మాత్రమే కాకుండా, దానితో పాటు ప్రత్యేక జన్యు చికిత్స పదార్థాలను ఉపయోగించారు.పరిశోధనలో దువ్వెనతో పాటు రెండు ప్రయోగాత్మక జన్యు చికిత్సలను ఉపయోగించినప్పుడు 28 రోజుల్లో సుమారు 97.85 శాతం వరకు జుట్టు కవరేజ్ నమోదైంది. సాధారణంగా ఉపయోగించే మినాక్సిడిల్ చికిత్సతో పోల్చినప్పుడు ఈ ప్రయోగంలో మెరుగైన ఫలితాలు కనిపించాయి.అయితే ఈ గణాంకాలు ఎలుకలపై నిర్వహించిన ప్రయోగానికి సంబంధించినవే. మనుషుల్లోనూ ఇదే స్థాయిలో జుట్టు పెరుగుతుందని ఇప్పుడే చెప్పలేం.

విద్యుత్ ఎలా పనిచేస్తుంది.?

ఈ పరికరంలోని ఎలక్ట్రోడ్లు ప్రత్యేకమైన పల్స్ విద్యుత్ క్షేత్రాన్ని సృష్టిస్తాయి. దీని ద్వారా చర్మం తాత్కాలికంగా ఔషధ పదార్థాలు లోపలికి చేరేందుకు అనుకూలంగా మారుతుంది. జుట్టు కుదుళ్లకు అవసరమైన పదార్థాలను మరింత లోతుగా చేరవేయడం ఈ విధానం లక్ష్యం.ఈ పరిశోధనలో ఉపయోగించిన రెండు ప్రయోగాత్మక చికిత్సల్లో ఒకటి జుట్టు కుదుళ్ల చుట్టూ రక్తనాళాల పెరుగుదలకు తోడ్పడే విధంగా, మరొకటి జుట్టు రాలిపోవడానికి కారణమయ్యే డీహైడ్రోటెస్టోస్టెరాన్ ప్రభావాన్ని తగ్గించే విధంగా రూపొందించారు.అంటే కేవలం విద్యుత్ దువ్వెనతోనే జుట్టు పెరిగిందని చెప్పడం సరైంది కాదు. విద్యుత్ సాంకేతికతతో పాటు ప్రత్యేక జన్యు చికిత్సల కలయిక ఈ ఫలితాలకు కారణమైంది.

మనుషులకు అందుబాటులోకి వచ్చిందా.?

ఇదే ఇప్పుడు అందరిలోనూ ఆసక్తి కలిగిస్తున్న ప్రశ్న. ఇప్పటివరకు ఈ ప్రత్యేక దువ్వెన మనుషులపై విజయవంతంగా పరీక్షించబడినట్లు ఆధారాలు లేవు. పరిశోధన ప్రస్తుతం ప్రయోగాత్మక దశలోనే ఉంది. మనుషులపై పరీక్షలు నిర్వహించి, దీర్ఘకాలిక భద్రత, దుష్ప్రభావాలు, చికిత్స ఫలితాలను నిర్ధారించాల్సి ఉంది.

జంతువులపై వచ్చిన ఫలితాలు మనుషుల్లోనూ అదే విధంగా వస్తాయని భావించకూడదు. అందువల్ల మార్కెట్‌లో ఈ పరికరం అందుబాటులోకి వచ్చిందని లేదా బట్టతలకు శాశ్వత పరిష్కారం లభించిందని వస్తున్న ప్రచారాన్ని నమ్మడానికి ఇంకా సమయం ఉంది.

జుట్టు రాలుతున్నవారు ఏం చేయాలి.?

జుట్టు రాలడానికి జన్యుపరమైన కారణాలు, హార్మోన్ల మార్పులు, పోషకాహార లోపాలు, థైరాయిడ్ సమస్యలు, ఒత్తిడి, ఇతర అనారోగ్య సమస్యలు కారణమవుతాయి. అందుకే కారణాన్ని తెలుసుకోకుండా మార్కెట్‌లో లభించే ప్రతి ఉత్పత్తిని ఉపయోగించడం మంచిది కాదు.

చర్మవ్యాధి నిపుణులను సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకోవాలి. వైద్యుల సూచన మేరకు మినాక్సిడిల్ వంటి చికిత్సలు, ఇతర వైద్య విధానాలను పరిశీలించవచ్చు. ప్రతి ఒక్కరికీ ఒకే చికిత్స పనిచేయదు.

మేనరిక వివాహాలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

- సంప్రదాయమా.. భావితరాలకు జన్యుపరమైన ముప్పా.?

- రక్తసంబంధ వివాహాలపై చట్టం అవసరమా.? ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచన.. కేంద్రం స్పందనపై ఆసక్తి

మన సమాజంలో తరతరాలుగా కొనసాగుతున్న కొన్ని ఆచారాలు, సంప్రదాయాలు ఇప్పుడు చర్చకు దారితీస్తున్నాయి. ముఖ్యంగా మేనరిక వివాహాల విషయంలో సుప్రీంకోర్టు చేసిన తాజా వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. కుటుంబ సంబంధాలు, సంప్రదాయాలు, వ్యక్తిగత స్వేచ్ఛ ఒకవైపు ఉంటే.. భావితరాల ఆరోగ్యం, పిల్లల్లో వచ్చే జన్యుపరమైన సమస్యలు మరోవైపు ప్రశ్నార్థకంగా మారుతున్నాయి.

మేడ్చల్ (ప్రశ్న న్యూస్)రక్తసంబంధీకుల మధ్య జరిగే వివాహాల వల్ల పుట్టబోయే పిల్లలకు జన్యుపరమైన ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశాలపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించింది. ఈ సందర్భంగా సమీప రక్తసంబంధాల మధ్య వివాహాల వల్ల కలిగే ఆరోగ్యపరమైన ప్రమాదాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది.

ఈ అంశంపై తగిన చట్టం తీసుకురావాల్సిన అవసరాన్ని పరిశీలించాలని లేదా పాఠశాలలు, కళాశాలల పాఠ్యాంశాలతో పాటు వివిధ ప్రచార మాధ్యమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది.అయితే మేనరిక వివాహాలను నేరుగా నిషేధించాలని కోర్టు ఆదేశించలేదు. వివాహాలను నియంత్రించే చట్టాలు చేయడం పార్లమెంట్ పరిధిలోని అంశమని స్పష్టం చేసింది. వివాహం వ్యక్తిగత ఎంపికకు సంబంధించిన విషయమని, అయితే ఆ నిర్ణయం సరైన అవగాహనతో తీసుకోవాలని పేర్కొంది.

మేనరిక వివాహాలతో జన్యుపరమైన సమస్యలు ఎందుకు?

సాధారణంగా మేనరిక వివాహం అంటే దగ్గరి రక్తసంబంధీకుల మధ్య జరిగే వివాహం. ఉదాహరణకు మేనమామ కుమార్తెను లేదా మేనత్త కుమారుడిని వివాహం చేసుకోవడం వంటి సంబంధాలు కొన్ని కుటుంబాల్లో సంప్రదాయంగా కొనసాగుతున్నాయి. ప్రతి మనిషిలోనూ కొన్ని జన్యుపరమైన లక్షణాలు ఉంటాయి. వాటిలో కొన్ని బయటకు కనిపించకుండా లోపల దాగి ఉండవచ్చు. ఒకే కుటుంబానికి చెందిన దగ్గరి బంధువులిద్దరిలో ఒకే రకమైన లోపభూయిష్ట జన్యువు ఉండే అవకాశం సాధారణ సంబంధాల కంటే ఎక్కువగా ఉంటుంది.

అలాంటి ఇద్దరి మధ్య వివాహం జరిగి పిల్లలు జన్మించినప్పుడు, తల్లిదండ్రుల నుంచి ఒకే రకమైన లోపభూయిష్ట జన్యువులు పిల్లలకు సంక్రమించే అవకాశం పెరుగుతుంది. ఫలితంగా కొన్ని వంశపారంపర్య వ్యాధులు బయటపడే ప్రమాదం ఉంటుంది.

పిల్లల్లో ఎలాంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది?

వైద్య పరిశోధనల ప్రకారం దగ్గరి రక్తసంబంధీకుల వివాహాల వల్ల కొన్ని రకాల జన్యుపరమైన వ్యాధుల ప్రమాదం పెరగవచ్చు.

- పుట్టుకతోనే వచ్చే కొన్ని జన్యుపరమైన లోపాలు.
- కంటి చూపుకు సంబంధించిన వంశపారంపర్య సమస్యలు.
- వినికిడి లోపాలు.
- కొన్ని రకాల రక్త సంబంధిత వ్యాధులు.
- శారీరక, మానసిక ఎదుగుదలలో సమస్యలు.
- అరుదైన జన్యుపరమైన వ్యాధులు.

అయితే మేనరిక వివాహం చేసుకున్న ప్రతి దంపతులకు అనారోగ్యంతో కూడిన పిల్లలే పుడతారని భావించడం తప్పు. అలాగే ఇతర సంబంధాల్లో వివాహం చేసుకున్నవారికి జన్యుపరమైన సమస్యలు రావని కూడా చెప్పలేం. ప్రమాద స్థాయి కుటుంబ చరిత్ర, జన్యువులు, సంబంధాల దగ్గరితనంపై ఆధారపడి ఉంటుంది.



చట్టం ఏం చెబుతోంది?

హిందూ వివాహ చట్టం-1955లోని సెక్షన్ 5 ప్రకారం కొన్ని సమీప బంధుత్వాల్లో వివాహాలకు పరిమితులు ఉన్నాయి. అయితే నిర్దిష్ట సంప్రదాయం లేదా ఆచారం అనుమతించే సందర్భాల్లో కొన్ని మినహాయింపులు కూడా ఉన్నాయి. అంటే మేనరిక వివాహాలన్నీ దేశంలో పూర్తిగా చట్టవిరుద్ధమని చెప్పలేం. ఆయా సంబంధాలు, వర్తించే వ్యక్తిగత చట్టాలు, సంప్రదాయాల ఆధారంగా చట్టబద్ధత మారుతుంది. ఈ మినహాయింపులకు ఆరోగ్యపరమైన రక్షణ చర్యలు జోడించాలా? వివాహానికి ముందు జన్యు కౌన్సెలింగ్, వైద్య పరీక్షలు వంటి అంశాలను తప్పనిసరి చేయాలా? అనే ప్రశ్నలు ప్రస్తుతం చర్చలోకి వచ్చాయి.

పెళ్లికి ముందు జన్యు పరీక్షలు అవసరమా?

మేనరిక వివాహం చేసుకోవాలనుకునే జంటలు ముందుగా వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది. కుటుంబంలో గతంలో జన్యుపరమైన వ్యాధులు, పుట్టుకతో వచ్చే లోపాలు, చిన్న వయసులోనే తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఉన్నాయా అనే విషయాలను తెలుసుకోవాలి.

అవసరమైతే జన్యు నిపుణుల సలహాతో పరీక్షలు చేయించుకోవాలి. జన్యు కౌన్సెలింగ్ ద్వారా భవిష్యత్తులో పిల్లలకు ఎలాంటి ఆరోగ్యపరమైన ప్రమాదాలు ఉండవచ్చో తెలుసుకోవచ్చు. ప్రతి జంటకు ఒకే రకమైన పరీక్షలు అవసరం ఉండవు. వైద్యుల సూచన మేరకే పరీక్షలు చేయించుకోవాలి.

సంప్రదాయాల కంటే ఆరోగ్య అవగాహన ముఖ్యమా?

సమాజంలో ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న ఆచారాలను ఒక్కరోజులో మార్చడం సాధ్యం కాదు. అలాగే సంప్రదాయాలను పాటించే కుటుంబాలను తప్పుబట్టడం కూడా సరైన విధానం కాదు. కానీ సంప్రదాయం పేరుతో ఆరోగ్యపరమైన వాస్తవాలను విస్మరించడం కూడా మంచిది కాదు. వివాహం అనేది ఇద్దరు వ్యక్తుల జీవితాలకు మాత్రమే పరిమితమైన విషయం కాదు. వారి ద్వారా రాబోయే భావితరాల ఆరోగ్యంతో కూడా ముడిపడి ఉంటుంది. అందుకే పెళ్లికి ముందు కుటుంబ ఆరోగ్య చరిత్రను తెలుసుకోవడం, అవసరమైన వైద్య సలహాలు తీసుకోవడం ఎంతో ముఖ్యం.

ప్రభుత్వం బాధ్యత ఏమిటి?

గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణాల్లోనూ మేనరిక వివాహాలపై శాస్త్రీయ అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. అంగన్‌వాడీలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా జన్యుపరమైన వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ప్రజలకు అందుబాటులో జన్యు కౌన్సెలింగ్ సేవలను విస్తరించాలి.

పెళ్లి చేసుకునే యువతకు, వారి కుటుంబాలకు వైద్యపరమైన సమాచారం అందించాలి. భయపెట్టడం కాకుండా వాస్తవాలను వివరించి, స్వచ్ఛందంగా సరైన నిర్ణయం తీసుకునేలా ప్రోత్సహించాలి.


సాకేత్ ప్రణామంలో నేడు ఉచిత మెడికల్ క్యాంపు

మేడ్చల్(ప్రశ్న న్యూస్) ఓజస్వి హోలిస్టిక్ హెల్త్ ఆధ్వర్యంలో సోమవారం నవంబర్ 23వ తేదీన సాకేత్ ప్రణామంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శేషసాయి, ప్రసాదరావు తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే ఈ క్యాంపులో జనరల్ ఫిజీషియన్, జనరల్ సర్జన్, ఫిజియోథెరపిస్ట్‌లు ఉచితంగా సంప్రదింపులు జరుపుతారని, రాండమ్ బ్లడ్ షుగర్ పరీక్షను పూర్తిగా ఉచితంగా నిర్వహిస్తారని, ఉపవాస రక్త పరీక్షలు, ఇతర సూచించిన పరీక్షల కోసం ఉదయం 8 గంటల నుండే రక్త నమూనాల సేకరణ ప్రారంభమవుతుందని, ఇతర డయాగ్నస్టిక్ పరీక్షలకు రుసుము ఉంటుందని తెలిపారు. అంతేకాకుండా యోగా, మెడిటేషన్ సేవలు అక్కడిక్కడే అందుబాటులో ఉంటాయని, ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు చైర్ యోగా సెషన్ నిర్వహిస్తారని, 65 ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజన్లకు కన్సల్టేషన్‌పై 50 శాతం, డయాగ్నస్టిక్స్‌పై 10 శాతం రాయితీ లభిస్తుందని, టెలీ కన్సల్టేషన్లు, హోమ్ డాక్టర్ విజిట్స్ సౌకర్యం కూడా ఉందని పేర్కొంటూ ఈ అవకాశాన్ని సాకేత్ ప్రణామం వాసులు, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. మరిన్ని వివరాలకు 9666020600 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



ఇన్‌స్టామార్ట్‌లో నాసిరకం ఆహార పదార్థాలు


- గుడ్లు కొంటే.. కుళ్లిన గుడ్లు సరఫరా
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని సిబ్బంది
- మల్లాపూర్ కార్యాలయంలో నిర్లక్ష్య సమాధానాలు
- టీజీ ఫాస్ట్‌కు ఫిర్యాదు చేసినా స్పందన కరువు
- ఫుడ్ సేఫ్టీ అధికారుల బాధ్యత ఎక్కడ.?





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఆన్‌లైన్‌లో నిత్యావసర సరుకులు కొనుగోలు చేస్తున్న వినియోగదారులకు నాణ్యమైన వస్తువులు అందించాల్సిన బాధ్యతను ప్రముఖ ఆన్‌లైన్ సరుకుల సరఫరా సంస్థలు విస్మరిస్తున్నాయా.? వేగంగా సరుకులు అందిస్తున్నామనే ప్రచారంతో వినియోగదారుల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నాయా.? ఇన్‌స్టామార్ట్‌లో గుడ్లు కొనుగోలు చేసిన ఓ వినియోగదారుడికి పాడైపోయిన గుడ్లు సరఫరా కావడం ఈ ప్రశ్నలకు తావిస్తోంది. నిత్యావసర వస్తువుల పేరుతో నాసిరకం ఆహార పదార్థాలను అంటగడుతున్నారంటూ బాధిత వినియోగదారుడు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.తనకు సరఫరా చేసిన గుడ్లు పాడైపోయిన విషయాన్ని గుర్తించిన వినియోగదారుడు సంబంధిత సంస్థకు ఫిర్యాదు చేయడంతో పాటు మల్లాపూర్‌లో ఉన్న ఇన్‌స్టామార్ట్ కార్యాలయానికి స్వయంగా వెళ్లి సిబ్బందికి సమస్యను వివరించినట్లు తెలిపారు. అయితే వినియోగదారుడి సమస్యను పరిష్కరించాల్సిన సిబ్బంది కనీస స్పందన కూడా చూపలేదని ఆరోపించారు. పైగా ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి.. మాకు సంబంధం లేదన్న ధోరణిలో సమాధానమిస్తూ చేతులెత్తేశారని వాపోయారు.





ప్రజల అవసరాలే వ్యాపారమా.?

వినియోగదారులు తమపై నమ్మకంతో ఆన్‌లైన్‌లో సరుకులు కొనుగోలు చేస్తుంటే, వారికి నాణ్యత లేని ఆహార పదార్థాలు సరఫరా చేయడం ఎంతవరకు సమంజసమని బాధితుడు ప్రశ్నిస్తున్నారు. ప్రజల నిత్యావసరాలను వ్యాపార అవకాశాలుగా మార్చుకుంటూ, వినియోగదారుల ఆరోగ్యం, హక్కులను గాలికి వదిలేస్తున్నారని మండిపడుతున్నారు. పాడైన గుడ్లను ఆహారంగా వినియోగిస్తే అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

టీజీ ఫాస్ట్‌కు ఫిర్యాదు.. అయినా స్పందనేది.?

ఈ వ్యవహారంపై టీజీ ఫాస్ట్‌కు కూడా ఫిర్యాదు చేసినప్పటికీ సంబంధిత అధికారుల నుంచి కనీస స్పందన రాలేదని బాధితుడు ఆరోపిస్తున్నారు. ఆహార భద్రతపై ఫిర్యాదులు అందినప్పుడు తక్షణమే స్పందించి తనిఖీలు నిర్వహించాల్సిన అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

ఫుడ్ సేఫ్టీ అధికారుల పర్యవేక్షణ ఏది.?

జీహెచ్ఎంసీ పరిధిలో ఆహార పదార్థాల నాణ్యతను పర్యవేక్షించాల్సిన ఫుడ్ సేఫ్టీ అధికారులు క్షేత్రస్థాయిలో ఎంతవరకు విధులు నిర్వహిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆహార భద్రత తనిఖీలు కాగితాలకే పరిమితమవుతున్నాయా.? వినియోగదారుల ఫిర్యాదులకు విలువ లేదా.? అధికారుల నిర్లక్ష్యానికి తోడు కొందరు సిబ్బంది లంచాలకు అలవాటుపడ్డారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అందుకే జీహెచ్ఎంసి పరిధిలో విద్యను నిర్మించే ఫుడ్ ఇన్స్పెక్టర్లు పూర్తి బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని కమిషనర్ కు ఫిర్యాదు చేసిన దిక్కు లేదన్న ఆవేదన ప్రజల వ్యక్తం చేస్తున్నారు కమిషనర్ల నిర్లక్ష్యంతోనే పుట్టి ఇన్స్పెక్టర్లు లంచాలకు అలవాటుపడి ప్రజల ఆరోగ్యంతో చెలగాడ మాడుతున్నారని ప్రజలు మండిపడుతున్నారు.

ఉన్నతాధికారులు స్పందించేది ఎప్పుడో.?

ఇన్‌స్టామార్ట్ సంస్థ సరఫరా చేసిన గుడ్ల నాణ్యతపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వినియోగదారుడు డిమాండ్ చేస్తున్నారు. మల్లాపూర్ కార్యాలయంలో ఫిర్యాదుదారుడితో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై కూడా విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. టీజీ ఫాస్ట్, ఫుడ్ సేఫ్టీ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి నగరవ్యాప్తంగా ఆన్‌లైన్ ఆహార సరఫరా సంస్థల గోదాములు, నిల్వ కేంద్రాలు, సరుకుల నాణ్యతపై తనిఖీలు చేపట్టాలి. వినియోగదారుల ఆరోగ్యంతో చెలగాటమాడితే కఠిన చర్యలు తప్పవనే సంకేతాలు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. వినియోగదారుడికి నాణ్యమైన ఆహారం అందించడం వ్యాపార సంస్థల బాధ్యత. ఆ హక్కును కాపాడటం ప్రభుత్వ అధికారుల బాధ్యత. మరి ఈ బాధ్యతను గుర్తు చేసేది ఎవరు.? అధికారుల బాధ్యతారాహిత్యాన్ని ప్రశ్నించేది ఎవరు.?

కార్తీక భక్తి సందడి.. ఇంద్రకీలాద్రిపై జనసంద్రం

- భవానీ మాలధారణకు బారులు తీరిన భక్తజనం
- ఆదివారం సెలవు. కార్తీక మాసం. అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు
- సామాన్య భక్తులకు త్వరిత దర్శనం కోసం అంతరాలయ దర్శనాలు నిలిపివేత..
- క్షేత్రస్థాయిలో సౌకర్యాలను పరిశీలించిన ఈవో శీనానాయక్



విజయవాడ(ప్రశ్న న్యూస్) ఒకవైపు పవిత్ర కార్తీక మాసం.. మరోవైపు ఆదివారం సెలవు.. ఇంకోవైపు శ్రీ భవానీ మండల దీక్షల స్వీకరణ పర్వదినం.. వెరసి ఇంద్రకీలాద్రి భక్తజన సంద్రంగా మారింది. కొండంత భక్తితో అమ్మవారి సన్నిధికి చేరుకున్న భక్తులతో కనకదుర్గమ్మ ఆలయ ప్రాంగణం, దర్శన క్యూలైన్లు కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే శ్రీ కనకదుర్గమ్మ దర్శనానికి, భవానీ దీక్షా మాలధారణకు భక్తులు భారీగా తరలిరావడంతో ఇంద్రకీలాద్రిపై ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

సామాన్య భక్తుల దర్శనానికి ప్రాధాన్యం..

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అందరికీ త్వరితగతిన అమ్మవారి దర్శనం కల్పించేందుకు దేవస్థానం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఇందులో భాగంగా ఉదయం 10 గంటల నుంచి అమ్మవారి అంతరాలయ దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేసి సామాన్య భక్తులకు సత్వర దర్శనానికి అవకాశం కల్పించారు. స్కానింగ్ పాయింట్ వద్ద ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమాదేవి, టెంపుల్ ఏఈవో రమేష్ బాబు, డీఈఈ అశోక్ కుమార్ భక్తుల రాకపోకలను క్రమబద్ధీకరించారు.

క్షేత్రస్థాయిలో ఈవో పర్యవేక్షణ..

భక్తుల రద్దీ నేపథ్యంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.కె. శీనానాయక్ కొండపైన, దిగువ ప్రాంతాల్లో స్వయంగా పర్యటించారు. దర్శన క్యూలైన్ల నిర్వహణ, భక్తులకు అందిస్తున్న సౌకర్యాలు, ఉచిత ప్రసాద పంపిణీ కేంద్రాలను పరిశీలించారు. రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు నిరంతరం కొనసాగించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యం..

ఘాట్ రోడ్డు, కనకదుర్గ నగర్ వైపు నుంచి వచ్చే వృద్ధులు, దివ్యాంగుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఉచిత బ్యాటరీ వాహనాల పనితీరును ఈవో పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బ్యాటరీ వాహనాలను నిరంతరాయంగా అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు.

భక్తుల ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం..

దర్శనానికి వచ్చిన భక్తులు తెలియజేసిన సమస్యలు, అభిప్రాయాలపై ఈవో ప్రత్యేక దృష్టి సారించారు. భక్తుల ఫీడ్‌బ్యాక్‌లో వెల్లడైన సమస్యలను సంబంధిత ఇంజినీరింగ్, ఇతర విభాగాల అధికారులు వెంటనే పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. అంతేకాకుండా సమస్యలు తెలిపిన భక్తులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి, పరిష్కార చర్యల వివరాలను తెలియజేయాలని సూచించారు.

చెత్త కుప్పల నిలయంగా సికింద్రాబాద్ నియోజకవర్గం

- లాలాపేట బ్రిడ్జి పక్కన ఏళ్ల తరబడి చెత్త దర్శనం
- తార్నాక--మెట్టుగూడ సర్కిల్ లలో గాడితప్పిన పారిశుద్ధ్య నిర్వహణ
- పర్యవేక్షణ మరిచిన అధికారులు.. బాధ్యతలు విస్మరించిన ఎస్ఎఫ్ఏలు
- డిప్యూటీ కమిషనర్లతో అంతర్గత ఒప్పందాలా.? బదిలీలకు ఎందుకు వెనుకడుగు.?
- ఏసీ గదులకే పరిమితమైన సికింద్రాబాద్ జోనల్ కమిషనర్.. క్షేత్రస్థాయి పర్యవేక్షణ ఏదీ.?



సికింద్రాబాద్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ నియోజకవర్గంలో పారిశుద్ధ్య నిర్వహణ పూర్తిగా గాడితప్పిందా.? నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాల్సిన అధికార యంత్రాంగం నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారిందా.? రహదారుల పక్కన చెత్త కుప్పలు పేరుకుపోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడా.? ముఖ్యంగా తార్నాక--మెట్టుగూడ సర్కిల్ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ తీరు ప్రజల్లో తీవ్ర అసహనాన్ని కలిగిస్తోంది. లాలాపేట బ్రిడ్జి పక్కనే సంవత్సరాల తరబడి చెత్త పేరుకుపోతున్నా తొలగించలేని దుస్థితి నెలకొనడం అధికారుల పనితీరుకు నిదర్శనంగా నిలుస్తోంది.

ఏళ్ల తరబడి ఒకే చోట చెత్త కుప్పలు..

లాలాపేట బ్రిడ్జి సమీపంలో పేరుకుపోయిన చెత్తను చూస్తే ఈ ప్రాంతంలో పారిశుద్ధ్య నిర్వహణ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. ప్రతిరోజూ ప్రజలు, వాహనదారులు తిరిగే ప్రధాన ప్రాంతంలోనే చెత్త కుప్పలు దర్శనమిస్తున్నా శానిటేషన్ సిబ్బందికి కనిపించడం లేదా.? లేక కనిపించినా పట్టించుకునే తీరిక లేదా.? చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాల్సిన బాధ్యత ఎవరిది.? పారిశుద్ధ్య పర్యవేక్షణ కోసం నియమించిన అధికారులు ఏం చేస్తున్నారన్న ప్రశ్నలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి.

ఒకే చోట పాతుకుపోయిన ఎస్ఎఫ్ఏలు..

తార్నాక, మెట్టుగూడసర్కిల్ పరిధిలో సంవత్సరాల తరబడి ఒకే ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న శాశ్వత ఉద్యోగులైన శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్ల (ఎస్ఎఫ్ఏ) పనితీరుపై కూడా అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విధుల్లో జవాబుదారీతనం పెంచేందుకు అవసరమైన బదిలీలు, బాధ్యతల మార్పిడి ఎందుకు జరగడం లేదు.? ఒకే ప్రాంతంలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న సిబ్బందిపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉందా.? లేక వారు చెప్పిందే నిబంధనగా మారిందా.? అన్న చర్చ సాగుతోంది.

డిప్యూటీ కమిషనర్లతో అంతర్గత ఒప్పందాలా.?

ఎస్ఎఫ్ఏల బదిలీల విషయంలో ఎందుకు జాప్యం జరుగుతోంది.? డిప్యూటీ కమిషనర్ల స్థాయిలో అంతర్గత అవగాహనలు ఉన్నాయా.? అనే అనుమానాలు స్థానికంగా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించే సిబ్బంది, అధికారులపై చర్యలు తీసుకోవాల్సింది పోయి, వారిని ఏళ్ల తరబడి ఒకే స్థానంలో కొనసాగించడం వెనుక కారణాలేమిటో జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు తేల్చాలి.

ఏసీ గదులకే పరిమితమైన జోనల్ కమిషనరా.?

సికింద్రాబాద్ జోన్ పరిధిలో పారిశుద్ధ్య పరిస్థితులు ఇంత దారుణంగా ఉంటే జోనల్ కమిషనర్ పర్యవేక్షణ ఎక్కడ.? క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారా.? సర్కిల్ అధికారుల పనితీరును సమీక్షిస్తున్నారా.? లేక కార్యాలయాలకే పరిమితమవుతున్నారా.? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజలు చెల్లిస్తున్న పన్నులతో జీతాలు తీసుకుంటున్న అధికారులు కనీస పారిశుద్ధ్య బాధ్యతలను కూడా సమర్థంగా నిర్వహించలేకపోతే వారి విధుల ప్రయోజనం ఏమిటి.? అన్నదానిపై జీహెచ్ఎంసి కమిషనర్ కె తెలియాలి.

కాంగ్రెస్ పాలనలోనూ మారని పారిశుద్ధ్య దుస్థితి

పరిశుభ్రమైన నగరం, మెరుగైన పౌర సేవలు అందిస్తామని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనూ క్షేతస్థాయిలో పరిస్థితులు మారకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రజారోగ్యానికి సంబంధించిన పారిశుద్ధ్య సమస్యలపై ప్రభుత్వం, జీహెచ్ఎంసీ యంత్రాంగం తక్షణమే స్పందించాలి. సికింద్రాబాద్ నియోజకవర్గంతో పాటు లాలాపేట బ్రిడ్జి వద్ద పేరుకుపోయిన చెత్తను తొలగించడంతో పాటు తార్నాక--మెట్టుగూడ సర్కిల్‌లో ఎస్ఎఫ్ఏల విధులపై సమగ్ర విచారణ జరపాలి. దీర్ఘకాలంగా ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న సిబ్బంది వివరాలను పరిశీలించి, అవసరమైన బదిలీలు చేపట్టాలి.ప్రజలకు కావాల్సింది జీహెచ్ఎంసి కమిషనర్ ప్రకటనలు కాదు. పరిశుభ్రమైన పరిసరాలు అధికారులకు కావాల్సింది ఏసీ గదుల సౌకర్యం కాదు. క్షేత్రస్థాయి పర్యవేక్షణ అన్నది ప్రభుత్వం గుర్తిస్తేనే ప్రజల సమస్యలు తీరతాయి. అన్నది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ఎప్పుడు అర్థం చేసుకుంటారో.

పెట్టుబడులు, ఉద్యోగాలపై చర్చకు సిద్ధమా?

- జగన్‌కు మంత్రి నారా లోకేశ్ సవాల్



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ మరియు ఉద్యోగాల కల్పన అంశాలపై వైసీపీ అధినే జగన్ కు రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ బహిరంగ సవాల్ విసిరారు. కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి వచ్చిన భారీ పెట్టుబడులు, ఏర్పాటవుతున్న ప్రాజెక్టుల వివరాలను వెల్లడిస్తూ ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో వివిధ రంగాలకు చెందిన అంతర్జాతీయ, జాతీయ స్థాయి అగ్రశ్రేణి సంస్థలు పెట్టుబడులు పెట్టాయని, తద్వారా వేలాది మంది యువతకు ఉద్యోగావకాశాలు లభించాయని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యువత భవిష్యత్తు కోసం పరిశ్రమలను రప్పించే ప్రయత్నం చేస్తుంటే, గత పాలకులు ప్రాజెక్టులను అడ్డుకోవడానికి న్యాయస్థానాల్లో పిటిషన్లు వేశారని, ఆ తర్వాత మళ్లీ ప్రాజెక్టుల క్రెడిట్ తమ ఖాతాలో వేసుకునేందుకు ప్రయత్నించారని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా 2024-26 కాలానికి సంబంధించిన పారిశ్రామిక ప్రగతి వివరాలను మంత్రి పంచుకున్నారు. అందులో గూగుల్ (రూ. 1,33,000 కోట్లు), ఏఎం/ఎన్ఎస్ ఇండియా (రూ. 1,36,000 కోట్లు), బ్రూక్‌ఫీల్డ్ (రూ. 1,06,000 కోట్లు), రిలయన్స్ (రూ. 43,000 కోట్లు), రెన్యూ, వారీ, ప్రీమియర్ ఎనర్జీస్, అల్ట్రాటెక్, దాల్మియా భారత్, అమరావతి క్వాంటమ్ వ్యాలీ, టాటా, ఐబీఎం, కాగ్నిజెంట్ తదితర సంస్థల ప్రాజెక్టులు వివిధ దశల్లో (కమిషన్డ్, నిర్మాణంలో, ఆపరేషనల్) ఉన్నట్లు ఆ జాబితాలో చూపించారు. ఈ వివరాలను ప్రస్తావిస్తూ "ఇది మా ట్రాక్ రికార్డ్. పరిశ్రమల పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన మరియు రాష్ట్ర అభివృద్ధిపై పూర్తిస్థాయిలో చర్చించేందుకు నేను సిద్ధంగా ఉన్నాను. నా సవాల్‌ను స్వీకరించడానికి మీరు సిద్ధమేనా?" అంటూ జగన్‌ను ఉద్దేశించి మంత్రి నారా లోకేశ్ ప్రశ్నించారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588